

## 'పై'
## పొలాల పై నుంచి రోడ్డు

2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం, 28 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 34 పేజీలు: 12 వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఓకే

వక్ఫ్ సవరణల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు 44 మార్పులు సూచించగా 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు జేపీసీ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా.. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. దీనితో ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. జేపీసీ సూచించిన ఈ 14 ప్రతిపాదనల ఆమోదానికి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక జేపీసీ లోక్‌సభకు అందజేస్తుంది.



## ట్రంప్, మోడీ ఫోన్ టాక్

ఢిల్లీః అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్‌లో మాట్లాడారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరునేతల మధ్య ఇదే తొలి ఫోన్ సంభాషణ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారిద్దరూ ఇండో-యూఎస్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన సందర్భంగా గతంలో ఆయనకు ప్రధాని మోడీ ఫోన్ కాల్లో అభినందనలు తెలిపిన విషయం విదితమే.



రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ కుట్ర

# రాహుల్ నేతృత్వంలో అడ్డుకుంటం

### బీజేపీ పేరుతో ఉన్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొందాం

ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ మధ్య జరుగుతున్న యుద్ధం

ఇండోర్ ''జై బాపు, జై భీమ్, జై సంవిధాన్''ర్యాలీలో సీఎం రేవంత్

> గజనీ మహమ్మద్ హిందుస్తాన్‌ను దోచుకోవడానికి ప్రయత్నించినట్లే రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోడీ కుయుక్తులు పన్నుతున్నారు.. కానీ, ఆయన ప్రయత్నం ఫలించడం లేదు. ఆనాడు బ్రిటిషర్ల నుంచి మహాత్మా గాంధీ దేశాన్ని రక్షించినట్లు బీజేపీ పేరుతో చెలామణి అవుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కునేందుకు ఈనాడు రాహుల్ గాంధీ నిలబడ్డారనీ.. మనమంతా ఆయన వెంట నడవాలి

హైదరాబాద్, మనం బ్యూరోః ప్రధానిగా మోడీ భాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని ప్రయత్నాన్ని అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ''జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'' ర్యాలీలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీతో కలసి పోరాటం చేస్తున్నామని వెల్లడించారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదు...ఇది ఒక యుద్ధమని పేర్కొన్నారు. ఈ యుద్ధం రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునే వారికి మధ్య జరుగుతున్న పోరాటమని స్పష్టం చేశారు. మోదీ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ముందుగానే పసిగట్టిన రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నాడన్నారు. గజనీ మహమ్మద్ హిందుస్తాన్‌ను దోచుకోవడానికి ...మిగతా 2లో

వేడెక్కిన రాజకీయం..

## పోలీసులను సంపిన గద్దర్‌కు అవార్డిస్తరా?

### సర్కార్‌పై కేంద్ర మంత్రి సంజయ్ కామెంట్స్



- బండిని బర్తరఫ్ చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్
- కేంద్ర మంత్రికి తక్కువ కార్పొరేటర్‌కు ఎక్కువ అంటూ సెటైర్లు
- గాంధీభవన్ వద్ద బండి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

హైదరాబాద్, మనం బ్యూరోః రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. కాంగ్రెస్ బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. రేషన్ ఇచ్చేది కేంద్రమైతే, రాష్ట్ర ప్రభుత్వం ఫోటో ఎందుకు ఉండాలని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపి బండి సంజయ్ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ కాక రేపాయి. అంతేకాకుండా కేంద్రం ఇచ్చే నిధులతో నిరుపేదలకు నిర్మించే ఇళ్లకు ఇందిరమ్మ పేరు ఎలా పెడతారంటూ ...మిగతా 2లో



## 'మధ్యాహ్న భోజనం' పై విద్యా కమిషన్ నివేదిక

హైదరాబాద్, జనవరి 27 (మనం న్యూస్)ః రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో విద్యా కమిషన్ సర్కారీ స్కూళ్లను సందర్శించింది. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన.. తదితర అంశాలతో తయారు చేసిన నివేదికను కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ...మిగతా 2లో

ఏ పార్టీ కండువా కప్పుకోను

## స్వతంత్రుడిగానే ఉంట

### వర్గీకరణను కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటున్నై

మాల సామాజిక వర్గ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న సీఎం రేవంత్

టీయూడబ్ల్యుజె మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ మాదిగ స్పష్టీకరణ



హైదరాబాద్, మనం బ్యూరోః ఎస్సీ వర్గీకరణను జీర్ణించుకోలేక పోతున్న కొన్ని శక్తులు పథకం ప్రకారం తనపై రాజకీయ ముద్ర వేసి లక్షలాది మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. దుష్ట శక్తులు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినప్పటికీ వర్గీకరణ అమలయ్యేంత వరకు పోరాడుతూనే ఉంటాననీ, భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకునేది లేదనీ, స్వతంత్రంగానే ...మిగతా 2లో

రైతు కూలీలంతా

## ఒక్కటే

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందరికీ వర్తింపజేయండి

సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, మనం ప్రతినిధిః గ్రామాల్లోని రైతు కూలీలతో పాటు మున్సిపాలిటీల్లోని రైతు కూలీలనూ ...మిగతా 2లో

సమ్మె సైరన్..

ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో

## విలీనం చేయాలె

- రెండు పీఆర్‌సీలు ఇవ్వాలె
- 21 డిమాండ్లతో యాజమాన్యానికి కార్మిక జేపీసీ నోటీసు
- స్పందించని పక్షంలో దీర్ఘకాలిక సమ్మెకు సై అంటున్న సంఘాలు



హైదరాబాద్, మనం బ్యూరో: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆర్టీసీ యాజమాన్యానికి 21 డిమాండ్లతో సోమవారం ఆర్టీసీ కార్మిక సంఘాలు.. జేఏసీ నేతృత్వంలో సమ్మె నోటీసులు ఇచ్చాయి. ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్ సెలవుపై ఉండటంతో ...మిగతా 2లో



## తిరుపతన్నకు బెయిల్

ఢిల్లీః ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందుతుడైన అదనపు ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 10 నెలలుగా పిటిషనర్ జైల్లో ఉన్నారని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందున ఆయన ఇంకా జైలులో ఉండాల్సిన అవసరంలేదని పేర్కొంది. ట్రయల్‌కు పూర్తిగా సహకరించాలి, జాప్యం చేయడానికి ప్రయత్నించొద్దంటూ ఆయనను హెచ్చరిస్తూ.. సాక్షులను ప్రభావితం చేసినా, కేసులో ఆధారాలు చెరిపేయడానికి ప్రయత్నించినా రాష్ట్ర ప్రభుత్వం బెయిల్ రద్దుకు కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీం ప్రకటించింది.

## అత్యంత వైభవంగా సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు పుష్కరోత్సవాలు
- రూ.25 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పనులు వేగంగా పూర్తి చేయాలె
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

హైదరాబాద్, మనం బ్యూరోః రాష్ట్రంలో అత్యంత వైభవంగా సరస్వతీ పుష్కరాలను నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు సంబంధిత పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జయశంకర్ ...మిగతా 2లో

## దానికి నువ్వే పేరు పెట్టు

గ్రహశకలాన్ని గుర్తించిన మన విద్యార్థికి అరుదైన అవకాశమిచ్చిన నాసా

2023లో అస్టరాయిడ్‌ను ఐడెంటిఫై చేసిన దక్ష్ మాలిక్



ఢిల్లీః నోయిడాకు చెందిన విద్యార్థి దక్ష్ మాలిక్ అరుదైన ఘనతను సాధించాడు. ఒక గ్రహశకలానికి పేరు పెట్టే అవకాశాన్ని పొందాడు. నాసాతో భాగస్వామి అయిన ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ డిస్కవరీ ప్రాజెక్టు కింద 2023లో మాలక్ టీం గ్రహశకలాన్ని గుర్తించింది. ఈ కారణంగా దానికి శాశ్వత పేరును పెట్టే బాధ్యతను నాసా దక్ష్‌కే అప్పగించింది. దీనిపై విద్యార్థి స్పందిస్తూ చిన్ననాటి నుంచి తనకు అంతరిక్షం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండేదన్నాడు. గ్రహాలు, ...మిగతా 2లో

తెలంగాణ వాటాను

## కాపాడండి

గోదావరి నదీ జలాల పంపిణీపై తక్షణ చర్యలు చేపట్టాలె

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధిః గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. తక్షణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలో జరుగుతున్న ...మిగతా 2లో



## ఎన్‌సీసీ సేవలు ఎనలేనివి

### 170 సరిహద్దు ప్రాంతాలు, 100 తీరప్రాంతాల్లో క్యాడెట్ల విధులు

- మొత్తం 20 లక్షల క్యాడెట్లలో 8 లక్షలకు పైగా యువతులే కావడం గర్వకారణం
- ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫారమ్డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా రికార్డు
- ఢిల్లీలో జరిగిన నేషనల్ క్యాడెట్స్ ర్యాలీలో ప్రధాని మోడీ ప్రశంసలు

ఢిల్లీ ః ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారం జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఎన్సీసీ అభివృద్ధికి తన ప్రభుత్వ పనితీరు చాలా సంతృప్తినిచ్చిందని ఆయన అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ...మిగతా 2లో

మహారాష్ట్రలో మరో వైరస్..

## జీబీఎస్ కలకలం

### అంటువ్యాధి కాదు.. ఆందోళన వద్దంటున్న వైద్యులు

ముంబైః మహారాష్ట్రలో గిలైన్ బారె సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. ఈ వైరస్ కారణంగా సోలాపూర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణించినట్లు అక్కడి వైద్య వర్గాలు వెల్లడించాయి. మరో నగరమైన పుణెలో జీబీఎస్ కేసుల సంఖ్య 101కి చేరుకుంది. వారిలో 16 మంది వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన వ్యక్తి కూడా పుణెలోనే చికిత్స పొందాడు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున ...మిగతా 2లో

# పొలాల 'పై' నుంచి రోడ్డు

వుహాన్ (చైనా) : రోడ్డు వేస్తే ఊరు అభివృద్ధి చెందుతుంది. కానీ. ఆ రోడ్డు పొలాలను ఆక్రమించి వేస్తే రైతుకు తీరని నష్టం. ఈ నష్టం పరోక్షంగా సమాజానికి, దేశానికి కూడా నష్టమే. దీని ప్రాధాన్యత గుర్తించిన చైనా.. రైతుకూ.. దేశానికి కూడా ఉపయుక్తంగా ఉండేలా సరికొత్త ఐడియాతో 126 కిలో మీటర్ల పొడవున్న హైవేను నిర్మించింది. వుహాన్- యాంగ్జీన్ హైవే పేరిట నిర్మించిన ఈ రోడ్డు మార్గం పంటపొలాలూ, చేపల చెరువుల 'పై' నుంచి సాగిపోతుంది. నేలపైన పంటలకు ఇబ్బంది లేకుండా ఎత్తయిన స్తంభాలు కట్టి, వాటి మీద ప్రత్యేకంగా నిర్మించిన ఈ హైవే చైనా సృష్టించిన మరో సరికొత్త విప్లవం అనొచ్చు!

# ఎన్‌సీసీ సేవలు ఎనలేనివి



(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. 'వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్సీసీ క్యాడెట్లతో సహా దేశ యవత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు.

2014లో 14 లక్షల మంది ఎన్సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫారమ్డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమన్నారు.

# అత్యంత వైభవంగా సరస్వతీ పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించను న్నట్లు మంత్రి తెలిపారు. పుష్కరాల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి ధన్య వాదాలు తెలిపారు. స్నాన ఘట్టాలు, డ్రైనేజీల నిర్మాణం, రోడ్ల విస్తరణకు ఈ నిధులను వినియోగించ నున్నట్లు వెల్లడించారు. సరస్వతీ నదీ పుష్కరాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు ఏర్పాట్లన్నీ పకడ్బందీగా ఉండాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామ య్యర్, కమిషనర్ శ్రీధర్‌లను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపట్టి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఏర్పా టుకు ముందు 2013లో వచ్చిన సరస్వతీ నదీ పుష్క రాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో గతంలో కంటే మిన్నగా అధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా అత్యంత వైభవోపేతంగా సరస్వతీ నదీ పుష్కరాలను నిర్వహిస్తామని ఈ సంద ర్భంగా మంత్రి సురేఖ వెల్లడించారు.

**గిరిజనులకు నాగోబా జాతర శుభాకాంక్షలు**

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీ కగా నిలిచే నాగోబా జాతర ఉత్సవాలకు ప్రారంభ సూచకంగా నిర్వహించే మహాపూజను పురస్కరించు కుని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభా కాంక్షలు తెలిపారు. గిరిజనులు అత్యంత నిష్టతో ఆచ రించే పూజా విధానం గొప్పదనీ, జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నిర్వ హించే ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద జాతర కావడం తెలంగాణకు ప్రత్యేకతను తెచ్చిపెట్టిందని ఈ సందర్భంగా సురేఖ పేర్కొన్నారు.

# తెలంగాణ వాటాను కాపాడండి

(మొదటి పేజీ తరువాయి)

జాప్యం, రాష్ట్రానికి జరుగుతున్న నష్టంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పొరుగు రాష్ట్రం ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడం వల్ల తెలంగాణ సాగునీటి ప్రయోజనాలు హరించబడతాయని హరీశ్రావు అన్నారు. విభజన చట్టం ప్రకారం గోదావరి-కృష్ణా బోర్డుల అనుమతులు తప్పనిసరిగా ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపట్టడం చట్ట ఉల్లంఘించడమే అని స్పష్టం చేశారు.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రాజెక్టుకు నిధుల కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెండు లేఖలు రాయడం పట్ల హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రణాళికల అనుమతులు ఇంకా పెండింగ్లో ఉండటం శోచనీయమని అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు.. అనుమతి రావడానికి కేంద్రం 6 నెలలుగా జాప్యం చేస్తోందని తెలిపారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌ఘడ్‌పై కేంద్రం జోక్యం అవసరమని అభిప్రాయపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై కేంద్రం దష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు. మిషన్ కాకతీయ, చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్లు ద్వారా సాగునీటి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని చెప్పారు. వరద జలాల వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు 1 టీఎంసీ నీరు ఎత్తిపోసే ప్రణాళికకు అనుమతులు ఇంకా లభించలేదని ఆయన పేర్కొన్నారు.

# స్వతంత్రుడిగానే ఉంట

(మొదటి పేజీ తరువాయి)

కార్యకలాపాలు కొనసాగిస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యుజె) ఆధ్వర్యంలో సోమవారం లక్ష డప్పు లు-వేల గొంతులు కార్యక్రమంపై మీట్ ది ప్రెస్ నిర్వ హించారు. టీయుడబ్ల్యూజె అధ్యక్షులు కె. విరాహత్ అలీ సమన్వయకర్తగా వ్యవహరించగా, ప్రధాన కార్య దర్శి రాంనారాయణ స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు మందకృష్ణ మాదిగ సమాధానాలిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును కూడా రాష్ట్రంలో గౌరవించకపోవడం విచారకరమనీ, తీర్పును అమలు చేస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారన్నారు. వర్గీకరణను అమలు చేయకుండా కాంగ్రెస్‌లోని మాల సామాజికవర్గం ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారనీ, కాంగ్రెస్‌ను శాసిస్తున్న మాలసామాజిక వర్గం ఒత్తిళ్లకు తలొగ్గిన సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణను అమలు చేయడం లేద న్నారు. అందుకే ఫిబ్రవరి 7వ తేదీన లక్ష డప్పులు-వేల గొంతుల సాంస్కృతిక కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. పద్మ అవార్డు తనకు ప్రక టించడం పట్ల సీఎం రేవంత్ తనకు అభినందనలు తెలిపారనీ, కానీ, తాము పంపించిన జాబితాలో ఎవ్వ రికీ రాలేదని అన్నారని మందకృష్ణ వ్యాఖ్యానించారు. మాల సామాజికవర్గానికి చెందిన గద్దర్, అందెశ్రీ, గోరటి వెంకన్న లాంటి వారి పేర్లతో జాబితా పంపించా రనీ, కేవలం లేఖ రాసి ఊరుకున్నారేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పద్మ అవార్డులు ఇవ్వా ల్సిన వ్యక్తుల ప్రతిభ గురించి కేంద్రానికి చెప్పి ఇప్పించాల్సి ఉండేదని వ్యాఖ్యానించారు. మాదిగ రిజ ర్వేషన్ ఉద్యమంతో పాటు అనేక సామాజిక ఉద్య మాలు నడిపిన నేపథ్యం తనకు ఉందన్నారు. ఆరో గ్యశ్రీ, వికలాంగుల పెన్షన్ వంటి సామాజిక మార్పులు తీసుకొచ్చిన ఘన చరిత్ర తనకుందని ఈ సందర్భంగా మందకృష్ణ వెల్లడించారు.




# రాహుల్ నేతృత్వంలో అడ్డుకుంటం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించినట్లు రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ ప్రయత్నిస్తున్నారనీ, అయితే, ఆయన ప్రయత్నం ఫలించడం లేదని వ్యాఖ్యానించారు. ఆనాడు బ్రిటిషర్ల నుంచి మహాత్మా గాంధీ దేశాన్ని రక్షించినట్లు బీజేపీ పేరుతో చెలామణి అవుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కునేందుకు రాహుల్ గాంధీ నిలబడ్డారనీ, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మనమంతా కలసిక ట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇది రెండు పరివార్‌ల మధ్య జరుగు తున్న యుద్ధమనీ, ఒకటి గాంధీ పరివార్, మరొకటి గాడ్సే పరివార్ అని పేర్కొన్నారు. గాడ్సే పరివార్ నుంచి మోదీ, గాంధీ పరివార్ నుంచి రాహుల్ గాంధీ పోరాడుతున్నారనీ, అందుకే మనమంతా రాహుల్ గాంధీకి మద్ద తుగా నిలవాలన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభు త్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



# పోలీసులను సంపిన గద్దర్‌కు అవార్డిస్తరా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించిన బండి పద్మశ్రీ అవార్డుకు గద్దర్ పేరు ను ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను కేంద్రం పరిగణ నలోనికి తీసుకోలేదంటూ సీఎం రేవంత్ కేంద్ర ప్రభు త్వం చేసిన విమర్శలపై సైతం ఘాటుగా స్పందించారు. పద్మ అవార్డులు ఆ స్థాయి ఉన్న వారికి ఇస్తాం, గద్దర్ కు ఆ అవార్డు ఎలా ఇస్తాం, బీజేపీ కార్య కర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం అంటూ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో లాభపడింది ఎవరో ప్రజ లకు తెలుసనీ పరోక్షంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ లను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు.

**సంజయ్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బండి వ్యాఖ్యలకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అదే స్థాయిలో కౌంట రిచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకు అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో ఉందా అని ప్రశ్నించారు. నాడు గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు ఆయన భావజాలం సంజయ్‌కు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను సమాజం ఖండించాలనీ, ప్రధాని మోడీకి రాజ్యాంగ సూత్రాల మీద అవగాహన ఉంటే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు ఒప్పుకున్నా, ఒప్పుకోకపో యినా గద్దర్ పేరు చిరస్మరణీయమనీ, కరసేవలకు మీద కాల్పులు చేయించిన నేతలకు అవార్డులు ఇచ్చి నప్పుడు భావజాలం ఎటు పోయిందని ప్రశ్నించారు. లెఫ్టిస్ట్ భావజాలం ఉన్న వ్యక్తులు బీజేపీలో లేరా? నక్స లిజం నా ఎజెండా అని చెప్పిన ఈటల రాజేందర్‌ను బీజేపీలో చేర్చుకుని ఎలా ఎంపీ పదవి ఇచ్చారని నిల దీశారు. నక్సలైట్లు దేశభక్తులు అన్న ఎన్టీఆర్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోలేదా అని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రికి తక్కువ కార్పొరేటర్‌కు ఎక్కువ అని వ్యాఖ్యానించారు.

త్వరలో రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు రాబోతు న్నారు పార్టీలో తన ప్రాధాన్యం తగ్గిపోతుందనే సంజయ్ ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని ఆరో పించారు. కాగా, గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీభవ న్‌లో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ క్ర మంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడుల చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరగడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రైతు కూలీలంతా ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలోకి తీసుకు రావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద గ్రామాల్లోని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చి, మున్సిపాలిటీల పరిధిలోని రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. భూమి లేని రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రైతు ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తులను స్వీకరించింది. గ్రామాల్లోని రైతు కూలీలకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పేర్కొంటూ నారాయణపేటకు చెందిన గవినోళ్ళ శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ పిటిషన్ వేశారు.

రాష్ట్రంలో 129 మున్సిపాలిటీలు ఉన్నాయని, ఈ మున్సిపాలిటీలలో 8 లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ హైకోర్టుకు తెలిపారు. గ్రామాల్లోని రైతు కూలీలకు ఈ పథకం ఇచ్చి, పట్టణ కూలీలకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా సమానంగా చూడాలన్నారు.

# ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

బస్‌భవన్ లోపల ఈడీ మునిశేఖర్‌కు కార్మిక సంఘాల నేతలు నోటీసులు అందజేశారు. బస్‌భవన్‌కు భారీ సంఖ్యలో చేరుకున్న కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, నాలుగేండ్ల తరువాత తెలంగాణలో మరోసారి ఆర్టీసీలో సమ్మెకు దిగేందుకు కార్మికులు నోటీసులు ఇవ్వడం చర్చనీ యాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమ యంలో హామీ ఇచ్చిన విధంగా ఆర్టీసీని వెంటనే ప్రభు త్వంలో విలీనం చేయాలనీ, రెండు పీఆర్‌సీలు అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సుదీర్ఘ సమ్మె నిర్వహించారు. అప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వ డంతో అప్పట్లో విరమించారు. అయితే, వాటిని అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో 2023 చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో ఆర్టీసీ కార్మికులు ఆ పార్టీని గద్దె దింపి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ మాదిరిగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తూ తాజాగా సోమవారం సమ్మె నోటీసులు అందజేసింది. కాగా, సమ్మె నోటీసు ఇచ్చిన ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించని పక్షంలో దీర్ఘకా లిక సమ్మెకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు కార్మిక సంఘాల జెఏసి నేతలు స్పష్టం చేశారు. దీంతో ఆర్టీసీ కార్మిక సంఘాల జెఏసి నేతల నోటీసులపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది.

## రైతు భరోసాపై.. రెండు మాటలా?

# పెట్టుబడులపై గప్పాలొద్దు?

- **ఆ హోర్డింగ్ చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావట్లేదు.. రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం**
- **మా బొమ్మలతో మీకేం పని... మీ బొమ్మలు పెట్టుకోండ్రి అంటూ ఆగ్రహం**



హైదరాబాద్, మనం ప్రతినిధిః హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏర్పాటు చేసిన హోర్డింగ్ చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెట్టుబడులను చూసి కడుపు మంటా? వాడండి ఈనో' అంటూ ఇటీవల ఏర్పాటుచేసిన హోర్డింగ్‌పై కేటీఆర్ స్పందించారు. ఈ సిపాయిలు (కాంగ్రెస్ ప్రభుత్వం) తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి మనకు అజీర్తి అయ్యిందట... మనం ఈనో తాగాలట? అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఉన్నాడని విమర్శించారు. ఏకంగా విద్యార్థుల పైకి తుపాకీ గురిపెట్టాడని ఆరోపించారు. తొమ్మిది నెలల పాటు ఓ తల్లి బిడ్డను ఎలా తన కడుపులో మోస్తుందో... అలాంటి ఇబ్బందులను బీఆర్ఎస్ ఉద్యమం సమయంలో పడిందన్నారు. 14 ఏళ్ల పాటు కేసులు ఎదుర్కొని, లాఠీ దెబ్బలు తిని, ఎన్నో అవమానాలు భరించి తెలంగాణను సాధించిందన్నారు. కానీ, ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమిటో చెప్పాలని కేటీఆర్ నిలదీశారు.

నిజంగా రేవంత్ రెడ్డి.. పెట్టుబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషిస్తామన్నారు. రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు అని గప్పాలు కొట్టడం సరికాదన్నారు. 2024లోనూ పెట్టుబడులు తెచ్చామంటూ ఇలాగే చెప్పారని, కానీ, ప్రజలకు మీ మీద అనుమానాలు ఉన్నాయన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో... కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో వాస్తవం కూడా అంతే ఉంటుందని కేటీఆర్ తనదైన శైలీలో విమర్శనాస్త్రాలు ఎక్కువెట్టారు. ప్రజల సొమ్ముతో హోర్డింగ్స్ పెడుతున్నారని.. అందులో మా బొమ్మలతో మీకేం పని... మీ బొమ్మలు పెట్టుకోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతనైతే వారు చెప్పిన పెట్టుబడులు ఎప్పుడు వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పని కంటే... ఎక్కువ పని చేస్తే రేవంత్ రెడ్డికి.. నేనే సన్మానం చేస్తామని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కొడంగల్‌లో ఒకే ప్రసంగంలో రైతు భరోసాపై సీఎం రేవంత్ రెడ్డి రెండు మాటలు మాట్లాడారన్నారు. అపరిచితుడు సినిమాలో రాము, రెమోలా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా డబ్బులు రేపు తెల్లారేసరికి పడతాయని మొదట చెప్పారని... ఆ తర్వాత కాసేపటికే, ఈ నెల 31 అని మాట మార్చాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతల మాటలకు గ్యారెంటీ లేదన్నారు. ఓట్ల కోసమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అంటున్నారని కేటీఆర్ ఆరోపించారు.

## వీసీని తొలగించాలె

# నియంతృత్వ నిర్ణయాలతో మా జీవితాలు ఆగమైతున్నయ్

- **డప్పు చప్పళ్లతో విద్యార్థి సంఘ నేతల ఆందోళన**
- **విద్యార్థులందరినీ భేషరతుగా పరీక్షలకు అనుమతించాలె**



హైదరాబాద్, మనం ప్రతినిధిః విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను తొలగించాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పూర్తీ వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు. వీసీ కార్యాలయం ఎదుట డప్పుల చప్పుడుతో పెద్ద ఎత్తున మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ నియంతృత్వ నిర్ణయాల వల్ల విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వర్సిటీలోని సమస్యలపై అనేక మార్లు విన్నవించుకున్నప్పటికి పట్టించుకోలేదన్నారు. వివిధ జిల్లాల నుంచి యూనివర్సిటీలో చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులని చదువుకు దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే వీసీని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. భేషరతుగా విద్యార్థులందరినీ పరీక్షలకు అనుమతించాలన్నారు. అలాగే, మూడో సెమిస్టర్ పరీక్షలు నెలరోజుల పాటు వాయిదా వేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వర్సిటీ సిబ్బంది వీసీతో చర్చలు జరిపిన అనంతరం విద్యార్థులందరికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# జీబీఎస్ కలకలం




(మొదటి పేజీ తరువాయి)

నరాలపై దాడి చేసే రుగ్మత ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డయేరియాకు కారణమయ్యే బ్యాక్టీరియా జీబీఎస్‌కు కారణం కావొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుంది.అయితే, ప్రతి వెయ్యి మందిలో ఒకరికే ఈ పరిస్థితి ఎదురవుతుంటుందని వైద్యవర్గాలు వెల్లడించాయి.

**భయాందోళనలు అవసరం లేదు..**

జీబీఎస్ అనేది అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు. అందుకని, ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, బాధితుల్లో 80 శాతం మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలల్లో స్వతహాగా నడవగలరంటూ వైద్యులు చెప్తున్నారు. మరికొంతమందికి మాత్రం ఆ సమయం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కూడా కావొచ్చు. ఇక ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్లు ఒక్కొక్కటి వేలల్లో ఉంటాయి. దీనిని దష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఊరట కలిగించే ప్రకటన చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా జీబీఎస్ చికిత్స అందిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ వెల్లడించారు.

## 'మధ్యాహ్న భోజనం'పై

# విద్యా కమిషన్ నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. నివేదికలో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూలో చేయాల్సిన మార్పులపై నివేదికలో పలు సూచనలు చేసింది. ''వారం వారం బిల్లులను చెల్లించాలి. ఇంటర్ కళాశాలల్లోనూ పథకాన్ని అమలు చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్స్, సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పద్ధతిలో విద్యార్థుల కోసం నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేయుచ్చు'' అంటూ.. పలు వివరాలను కమిషన్ నివేదికలో పొందుపరిచింది.

# దానికి నువ్వే పేరు పెట్టు




(మొదటి పేజీ తరువాయి)

సౌర వ్యవస్థకు సంబంధించిన నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీలు బాగా చూసేవాడినని తెలిపాడు. ఈ గ్రహశకలాన్ని కనుగొనడానికి పని చేస్తూ నేను నాసాలో పని చేస్తున్న శాస్త్రవేత్తలా ఊహించుకునేవాడినని చెప్పాడు. 'డిస్ట్రాయర్ ఆఫ్ ది వరల్డ్,' 'కౌంట్ డౌన్' వంటి పేర్ల గురించి తమ టీంలో చర్చ జరుగుతుందని, బహూశా మేము కనుగొన్న గ్రహ శకలం పేరు ఈ రెండిట్లో ఒకటి పెట్టొచ్చు అన్నాడు.

# ఉచిత విద్యుత్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ

**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** రజక నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు కింద బకాయి పడ్డ రూ .200 కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలి అని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎల్బీనగర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ఆమాంచ అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన రేట్ల బోర్డు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా రాచమల్ల బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 36 వేల కటింగ్ షాపులకు ఉచిత విద్యుత్తు సబ్సిడీ బిల్లు వస్తుంది అని ఆ బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తలేదని కరెంట్ డిపార్ట్మెంట్ వారు బిల్లులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు అని అన్నారు.గత సంవత్సరం నుండి 50 కోట్ల బకాయిలు ఉన్నవి అని ఆ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి నాయి బ్రాహ్మణులను ఆదుకోవాలి అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి చేయాలని 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, వృత్తి చేసుకుంటూ అకస్మికంగా మరణించిన వారికి 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర కార్పొరేటర్ సంస్థలు ఇతర వర్గాల వారు రాకుంట ప్రభుత్వం అడ్డుకట్టాలన్నారు. నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్ గా మార్చి 1000 కోట్లు విడుదల చేసి దానికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జంపాల వెంకటేష్,ఎల్బీనగర్ అధ్యక్షుడు మంకాల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ రాపర్తి రవీందర్, శివ కుమార్ పెద్ద ఎత్తున దుకాణదారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ



**చేవెళ్ల, జనవరి 27(మనం న్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం భోజనప్లేట్లు, గ్లాస్ లను అందజేశారు. చేవెళ్లలోని శ్రీకృష్ణ జ్యువెలర్స్ యజమాని కుమారుడు అవుసుల ప్రేమ్ కుమార్ చారి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాస్ లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుతం సమాజంలో విద్య ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్ మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# భూకబ్జాకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

- మాజీ సైనికుడి భూ ఆక్రమణ
- తూటి రామచందర్‌తో మాకు ప్రాణహాని ఉంది
- జవహర్ నగర్ పోలీసులకు బాధితుడు రాజ్ కుమార్ ఫిర్యాదు

**జవహర్ నగర్, జనవరి 27 (మనం న్యూస్):** కాప్రా మండలం జవహర్ నగర్ మున్సిపాలిటీలోని సర్వేనెంబర్ 376, 349, 327 లలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్ సర్వీస్ మెన్ కోటా క్రింద తన తాత బట్టు జాన్ బిన్నీకి ప్రభుత్వం కేటాయించినట్లు అజిత్ రాజ్ కుమార్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అట్టి భూమి లో 14 ఎకరాలు ఎంక్రోజ్ మెంట్ కాగా మిగిలిన 1.4 ఎకర భూమిలో హద్దులు ఏర్పరచుకొని ఫెన్సింగ్ చేసినట్లు తెలిపారు. గత ఏడు సంవత్సరాల క్రితం మనోహర్ అనే వ్యక్తి తమ భూమిలో అక్రమంగా ప్రవేశించి తమపై దౌర్జన్యం చేశారని, అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు తర్వాత అటువైపు మనోహర్ రాలేదని అయితే ఈనెల 20న తమ భూమిలో గది నిర్మానం చేస్తున్న క్రమంలో రాత్రి సమయంలో తూటి రామచందర్ తో పాటు మరికొంతమంది నిర్మాణ పనులను అడ్డుకోవడమే ఇతనిపై విచారణ జరిపించి, మాకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

జవహర్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సైదయ్యను వివరణ కోరగా...




కాకుండా దుర్భాషలాడుతూ, భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. నిర్మాణంలో ఉన్న బేస్మెంట్ ను సైతం కూలగొట్టి ఈ భూమి తనదని ఈ భూమిలో నిర్మాణం చేస్తే చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తూటి రామచందర్ అనే వ్యక్తితో మాకు ప్రాణహాని ఉందని వీరు గతంలో కూడా పలుమార్లు బెదిరించాలని

తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు తూటి రామచందర్ పై కేసు నమోదు చేశామని, ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సదరు అంశంపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ అధికారులతో సంప్రదించి ఈ కేసుపై స్పష్టత రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు

- ప్రజా ఏక్త పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ దీక్ష..

హైదరాబాద్, జనవరి 27 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ ఆదివారం ప్రజాఏక్త పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును ప్రభుత్వం కొనసాగించాలని కోరారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేయడం మాత్రమే కాదు. . పొట్టి శ్రీరాములు తన జీవితమంతా తెలుగు జాతి సంస్కృతిని, వైభవాన్ని విస్తరింప చేయడానికి కృషి చేశారని ఆయన చెప్పారు. అందుకే తెలుగు యూనివర్సిటీకి ఆ పేరు పెట్టారని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యతతో పెట్టిన పేరును తొలగించవద్దని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం (ఏ పి ఒంగోలు)అధ్యక్షులు నాగ ఆంజనేయులు పాల్గొని 36 గంటలుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బోనాల శ్రీనివాస్ కు నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్ష తాత్కాలికమే అని, రానున్న రోజుల్లో ఆందోళనలను కొనసాగిస్తామని, వివిధ రూపాల్లో పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఏక్తా పార్టీ నాయకులు సాంబ రవీందర్, నరేష్ దుప్పల, ఎంకే నరేందర్, రాచర్ల విష్ణు, కొల్ల శ్రీధర్, పెద్ద ఎత్తున తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.







# ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్నఎమ్మెల్యే



**చేవెళ్ల, జనవరి 27(మనం న్యూస్):** చేవెళ్ల మండలం ఆలూరు గ్రామ సమీపంలో హజారత్ ముక్దుం బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత పెద్దల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు ,కార్యకర్తలు, మైనార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నరసింహ

**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం, మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిగామ నరసింహ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ గా నియమితులయ్యారు.ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చినందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ నగరగారి ప్రీతం , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి లకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలు ప్రజల ముందుకు తీసుకువెళ్లి ప్రజా ప్రభుత్వంలో ప్రతిపక్షానికి స్థానం లేకుండా చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీతో ఎస్సీలకు మంచి పదవులు దక్కుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇజ్రాయిల్, ఒత్తుల



రఘుపతి, సిహెచ్ యాదయ్య,ఆవుల యాదయ్య, మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, నాయక్,బొక్క భూపాల్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,రాజు నాయక్,సేవ్యా నాయక్, చేపంగి ప్రవీణ్, లాజర్, నర్సింహా నాయక్ అర్చన్ నాయక్, రాజు గొల్లూరి, తదితరులు పాల్గొన్నారు...

# సొంత నిధులతో బోర్ వేయించిన చిలుక

**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ హరిపురి కాలనీలో నీటి సమస్య ఉండడంతో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి తన సొంత నిధులతో హరిపురి కాలనీలోని మహిళా భవనంలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



కాలనీలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, టిపిసిసి ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి ల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణమూర్తి, నోముల మురళీ, ప్రభాకర్ రెడ్డి, యాది రెడ్డి, యాదగిరి, అనిల్, వంశి, మారం సుజాత రెడ్డి, హేమ రెడ్డి, సుకన్య, అనిత, జి .పద్మజ, వనజ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- సినీ నటుడు, ఆర్యవైశ్య మహాసభ నాయకులు పసుపునూరి శ్రీనివాస్

**సిద్దిపేట, జనవరి 27, మనం న్యూస్ ప్రతినిధి:** ఆర్యవైశ్యులు ప్రజలకు సేవచేయడంతో పాటు రాజకీయంగా ఎదగాలని సినీ నటుడు, ఆర్యవైశ్య మహాసభ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు పసుపునూరి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలోని వైశ్య భవన్ లో సోమవారం నిర్వహించిన వాసవి క్లబ్ వనిత క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ కేవం ఆర్యవైశ్యులు మాత్రమే సభ్యులుగా ఉండి అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలకు అతీతంగా సేవ




చేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇప్పటి వరకు క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో రకాల సేవలు చేశారని, మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ క్లబ్ ను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం వాసవి క్లబ్ అధ్యక్షులుగా మురంశెట్టి కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిగుళ్లపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా బెజగం రమేష్, పి.ఆర్.ఓగా మరియాల వీరేశం, వనిత క్లబ్ అధ్యక్షులుగా చిగుళ్లపల్లి మంజుల, ప్రధాన కార్యదర్శిగా బెజగం రూప, కోశాధికారిగా చిగుళ్లపల్లి ధనలక్ష్మి, పి.ఆర్.ఓగా స్వప్నలచే ప్ర మాణ స్వీకారం చేయించారు. మిగతా కార్యవర్గాన్ని వాసవి క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి, రీజియన్ చైర్మన్ పుల్లూరి శశ కాంక్ లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహా ధర్నాను విజయవంతం చేద్దాం

- అధ్యక్షుడు గురువయ్య యాదవ్

**రంగారెడ్డి, జనవరి 27(మనం న్యూస్):** రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం



అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరికి నిరసనగా మంగళవారం 28వ తేదీన నల్గొండ క్లాక్ టవర్ వద్ద నిర్వహించే ' మహా ధర్నా' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఇండ్లూర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డమీది గురవయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారంఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నలగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మందకృష్ణ మాదిగను కలిసిన చేవెళ్ల భాజపా నాయకులు

**చేవెళ్ల, జనవరి 27(మనం న్యూస్ ):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా చేవెళ్ల మండల భాజపా అధ్యక్షులు అనంతరెడ్డి, యువ నాయకులు డాక్టర్ ఎం వైభవరెడ్డి ల ఆధ్వర్యంలో భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్చం, ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సిపిఎస్ ఉద్యోగులకు ఓపిఎస్‌ని పునరుద్ధరించాలి: పి ఆర్ టి యు



**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** పి ఆర్ టి యు టీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సిపిఎస్ ఉద్యోగులకు ఓ పి ఎస్ ని పునరుద్ధరించాలని కోరుతూ పిఆర్టియుటీఎస్ సైదాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల ఎమ్మార్వో జయశ్రీ కి మంగళవారం మండల అధ్యక్షులు అంజనేశ్వర్ , ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి , రాష్ట్ర బాధ్యులు సాంబశివరావు, మండల బాధ్యులు రఘువీర్ రెడ్డి దామోదర్ రెడ్డి కలిసి మెమోరాండం ఇచ్చారు.

# కిడ్నీరాకెట్ కేసు లో మరో నిందితుడు అరెస్ట్

**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** సరూర్ నగర్ లోని అలకనంద ఆసుపత్రిలో జరిగిన కిడ్నీ మార్పిడి సంఘటన లో సరూర్నగర్ పోలీసులు మరో నిందితున్ని అరెస్టు చేశారు. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని మిలిటరీ కాలనీకి చెందిన పెరుమళ్ళ రాజశేఖర్ (59) చెన్నైలోని పెరుమ్ బాలం, నూకంపాలయం లో ఉంటూ సవిత మెడికల్ కాలేజీలో డాక్టర్ గా



పనిచేస్తున్నాడు. విచారణలో ఇతని పాత్ర ఉండడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఏ 13 గా ఉన్నాడు అని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్):** రోడ్డు దాటుకుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిల్ సుఖ్ నగర్ లోని పుల్లా రెడ్డి స్వీట్ హౌస్



ముందు గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన యెడల 8712662305, 8712662358 నెంబర్ లకు ఫోన్ చేసి తెలుపగలరు అని అన్నారు.

## కుంభమేళ ప్రజా సమ్మేళనం..

హైందవ జాతి గొప్పతనం చాటింపు
సనాతన ధర్మం విశ్వవ్యాప్త సూర్యోదయం
హిందూమత వైభవోపేతమైన సంగమంగా
ప్రపంచానికి కుంభమేళాలో నిరూపితం..
సాదు సంతతి గంగానదిలా కదులు తుంది
కోటానుకోట్ల జనసంద్రంగా నిలిచింది
పవిత్ర నది జలాల స్నానాలతో
పులకరించింది యావత్తు హైందవ జాతి..
అఘోరాల కాలరాత్రి నృత్యాలు
నాగ సాధువుల ప్రత్యక్ష మహిమలు
కుంభమేళలో కనుల నిండా జ్ఞాపకాలు
రక్త వర్ణ శోభాయమాన వీక్షణలు.
దైవ నామ స్మరణలతో మారుమ్రోగుతూ
అఖండ ఘోషలతో వినిపించే మంత్రం
కొత్త సరికొత్త రూపంలో కనిపిస్తూ
సంచరించే సాంస్కృతి సాంప్రదాయాల
వైభవం..
యోగ పుంగవుల యోగాసనాల విన్యాసం
సాదు సంఘము సంధ్య వేళ ప్రాణాయామం
నిత్యాగ్నిహోత్ర జ్వాలల వెలుగులు
కేళీ నృత్య విన్యాసాల శోభాయమానం...
రుద్రాక్ష మాలల కంఠాభరణం అలంకారం
బూడిద పూసిన తనువులే ఆకారం
కాషాయ వస్త్ర పవిత్ర సంగమ సందేశం
భక్తి మోక్షమార్గాల సాధన సంపర్కం..
ఇలలో జరిగిన మహా కుంభమేళ సమ్మేళనం
వెతికి చూసినా దొరకదు నేలపై ఈ వైభవం
భారత సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం
విదేశీయులు సైతం ఆకర్షించిన పవిత్ర ప్రదేశం..


**- కొప్పుల ప్రసాద్**

# నవభారతానికి వెన్నెముక అంకుర సంస్థలు



నవభారతంలో మానవ నాగరికతలో అత్యంత సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపడంలో, అన్ని చిక్కులను తొలగించుకుంటూ నిజంగా మన మనసు నమ్మిన దాన్ని మన కళ్ళ ముందు నిలవడానికి పడే తపని లేదా ఒక ఆకారం ఇవ్వడం లేదా ఆలోచన, ధ్రువీకరణ, ఆరంభ వేగం, ఎదుగుదల, ఒక అపూర్వ సృష్టిని ఆవిష్కరించడం, పరిష్కారాల రూపంలో వస్తువుల రూపంలో లేదా సర్వీస్ రూపంలో కొత్త దారి వేస్తూ ప్రయాణాన్ని ఆహ్లాదపరుస్తూ కొత్త మార్గంలోకి మళ్లిస్తూ, నవ భారతానికి వెన్నముక్కగా నిలబడిన సంస్థలే అంకుర సంస్థలు. ఈ సంస్థలు సంస్కృతిని ఆవిష్కరించడం దీని ముఖ్య ఉద్దేశం.. భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధ విధానాలను పగడ్బందీగా అమలు చేస్తుంది, దేశ యువతను ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేపట్టిన అగ్రశ్రేణి కార్యక్రమాల్లో ఒకటైన అంకుర భారతం ఎంతో నిర్ణయాత్మకమైనదే కాకుండా అత్యంత అసాధారణమైనది. స్థిర ఆర్థిక అభివృద్ధికి, భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించగల అమేయమైన శక్తి ఈ అంకుర సంస్థలకు ఉన్నది. పరిశోధనలు, పరిష్కారాలను నిర్వహించే ప్రక్రియల రూపకల్పన ద్వారా అంకుర సంస్థల (స్టార్టప్ ఇండియా) పేరిట 2016లో అమలులోకి వచ్చింది. ఉద్యోగం కోసం వెతుకులాటగా కాకుండా, ఉద్యోగాల కల్పనకు తలుపులు తెరిచే దేశంగా భారత్లో పరివర్తన తీసుకురావాలని, పటిష్టమైన అంకుర సంస్థల సంస్కృతిని పాదుకొలపాలని, యువ పారిశ్రామికవేత్తలకు ఈ దిశగా ప్రోత్సహించడానికి చాలా కార్యక్రమాలతో ఒక కార్యచరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. దేశాన్ని సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు నడిపించడంతోపాటు భారీగా ఉపాధి అవకాశాల సృష్టికి నాయకత్వం వహించవలసిందిగా మన నవ భారతీయ ఆవిష్కర్తలకు, వ్యవస్థాపకులు, మేధావులకు స్పష్టమైన పిలుపునిస్తూ 2016 జనవరి 16న అంకుర భారత్ (స్టార్టప్ ఇండియా) కార్యక్రమం శ్రీకారం చుట్టుకుంది, ప్రస్తుతం భారత అంకుర పర్యావరణం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వ్యవస్థగా అవతరించినది.

ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా స్వావలంబన, సుస్థిర అభివృద్ధికి నూతన ఆవిష్కరణలే పునాది, అలాగే జనజీవన పరివర్తనలో ఆవిష్కరణల పాత్ర పోషణకు దోహదం చేసే ఇసురువంటిది వ్యవస్థాపన. ఈ నిబద్ధతతో 'స్వయం సమృద్ధ భారతం' లక్ష్యసాధనకు మన కృషిలో భాగంగా ఆవిష్కరణలకు ప్రోత్సాహం, వ్యవస్థాపకులకు మద్దతు అత్యంత ఆవశ్యకత. నేడు భారతదేశంలో పరిమాణం, ప్రమాణాల పరంగా విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మూలధన పెట్టుబడితో పాటు ప్రపంచవ్యాప్త అత్యుత్తమ, ఆవిష్కరణత్మక విధానాలను కూడా దేశంలోకి ఆహ్వానించడమే ఇందుకు కారణం, అంతేకాదు విధానపరంగా నిర్దిష్ట ప్రత్యేక చర్యలు చెప్పడం ద్వారా సత్వర వాణిజ్య అభివృద్ధి సౌలభ్యం కూడా కల్పిస్తుంది. ఆ విధంగా ప్రపంచంలో అత్యుత్తమమైన మార్గాన్ని మన యువ పారిశ్రామికవేత్తలకు చేరువచేసే దిశగా ప్రభుత్వం నిబంధనలతో కృచేస్తుంది. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి మన దేశానికి 950 మిలియన్ డాలర్లు పైగా విదేశీ ప్రత్యక్ష పడబడులు రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో వివిధ రంగాలకు ఈ పెట్టుబడులు రావడం మరో విశేషం. డిజిటల్ భారతం, బ్రాడ్ బ్యాండ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోనూ అంకుర సంస్థల పర్యావరణ అభివృద్ధికి దోహదం చేశాయి. అలాగే కీలక అవకాశాలు, పెట్టుబడుల సౌలభ్యం దిశగా సుదూర ప్రాంతాల్లోని ఆవిష్కర్తలు, అంకుర సంస్థల కు మార్గ్ పోర్టల్ చేయతనిస్తోంది. అంకుర పర్యావరణ వ్యవస్థ ఇప్పటికే వేగంగా ఎదుగుతుంది, ఈ మేరకు ప్రైవేట్ పెట్టుబడుల ప్రోత్సాహం, పరిశుభ్ర ఇంధన పరివర్తన, నూతన పరిష్కారాల అన్వేషణ తదితరాల ద్వారా ఆర్థిక వ్యవస్థలోని వివిధ విభాగాల డిజిటల్ పరివర్తన ద్వారా దేశ వృద్ధి దశకు చోధకంగా మారింది. అంకుర సంస్థల ఉద్యమాన్ని సాంకేతిక రంగంలోనే కాక వ్యవసాయం, తయారీ, సామాజిక రంగం, ఆరోగ్య సంరక్షణ, విద్యారంగం, వంటి పలు రంగాలకు పట్టణ ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరిస్తూ, అలాగే ఎక్కువ ప్రయాస లేకుండా బయటపడే వెసులుబాటు కల్పించడం, సత్వర న్యాయ సహాయం, మేధా హక్కులు త్వరగా సాధించడం, సమాచారం సరిగా అందేలా చూడడం, పెట్టుబడుల కల్పన, పన్ను ప్రోత్సహకాలు, యోగ్యమైన వాటికి పన్నుల మినహాయింపు, అదనపు పెట్టుబడులకు ప్రోత్సహిస్తూ, అవకాశాల కల్పన రుణ హామీ పరిశ్రమలు, విద్యాసంస్థలతో భాగస్వామ్యం ప్రయోగశాల ఏర్పాటు వంటివి ఏర్పాటు చేయాలి. స్వాగతించదగిన పర్యావరణ వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడంలోనూ, ఆర్థిక బలం అంగ బలం ఇచ్చి ప్రోత్సహించవలెను.




**- డా. పుల్లయ్య దూదేకుల**
9490402696

## ఆకుపచ్చ నేల



గగనంలో
మబ్బుల మృదంగం
చినుకు కురిసి
ఏ విత్తనం ఆశగా
మొలకెత్తునో మట్టి

చినుకుల చిటపట
చెట్టూచేమల ఆనందగీతం
ప్రాణమే ఆకుపచ్చ జీవద్భాష

ఈల ఊరు లీల
రాకపోకలెప్పుడూ
పంచభూతాల అతిథులే
వీచే గాలి స్వేచ్ఛే బతుకు నుడి

చిలకరించని చినుకు
చేజారిన ఊపిరి ఎడారి
బతుకున
చినుకు చినుకు నడుమ అగ్నీ మంచు



బడి నడిచే రోజులు
నన్ను మరువని సంజీవిని
నన్నూ నా పుస్తకాలనూ తడిపే
నా భుజం సంచినీ చినుకు

బడిబాటలో తీపిబాధ
పరుగు గొంతెత్తే ఉత్సాహంలో వరద

చిగురించే కళ చినుకు
మనసుదోచే ఉరవడి
నింగీనేలను మెరిసే ఇంద్రధనుస్సు

దయామయి
గుండెపాట ఎగిరే ప్రకృతి నిండా
మంచు రాలే చినుకే ఉదయాహ్వానం

చినుకు రాలి
వరద నదులైన వాన
పంటలన్నీ ఊగే జీవ జలకాల
ఆపై
నీటి పరుగే జలధిఎద


**- డా.టి. రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# ప్రజాస్వామ్యాన్ని రక్షించే రాజ్యాంగంపై అవగాహన అవసరం



భారత రాజ్యాంగం (భారతీయ సంవిధాన) 26 జనవరి 1950 నుండి అమల్లోకి వచ్చినందున మన భారతదేశంలో గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సంవత్సరం మనం 76 వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఈ సందర్భంగా, భారత పరిపాలన యొక్క మూల స్తంభాన్ని తయారు చేయడానికి రాజ్యాంగ అసెంబ్లీ చేసిన ప్రయత్నాలను మనం గుర్తు చేసుకోవాలి. భారతదేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పొడవైన లిఖిత రాజ్యాంగం. రాజ్యాంగాన్ని పూర్తి చేయడానికి సుమారు 2 సంవత్సరాలు, 11 నెలలు, 18 రోజులు పట్టింది. భారత రాజ్యాంగం భారతదేశ అత్యున్నత చట్టం. ఈ పత్రం ప్రాథమిక రాజకీయ నియమావళి, నిర్మాణం, విధానాలు, అధికారాలు మరియు ప్రభుత్వ సంస్థల విధులను గుర్తించే లా నిర్దేశిస్తుంది. ప్రాథమిక హక్కులు, నిర్దేశక సూత్రాలు, పౌరుల విధులను నిర్దేశిస్తుంది. ప్రారంభంలో ఇది 12 భాగాలుగా మరియు 9 షెడ్యూల్లలో 395 నిభంధనలు కలిగి ఉంది. సుమారు 145,000 పదాలతో, ఇది అలబామా రాజ్యాంగం తరువాత ప్రపంచంలో రెండవ అతి పొడవైన క్రియాశీల రాజ్యాంగం. ఇప్పుడు, రాజ్యాంగంలో ఒక ఉపోద్ఘాతం మరియు 448 నిభంధనలు ఉన్నాయి, అవి 25 భాగాలుగా విభజించబడ్డాయి. 12 షెడ్యూల్ మరియు ఐదు అనుబంధాలతో, 2025 జనవరి నాటికి 106 సార్లు సవరించబడింది.

రాజ్యాంగమే భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేది. ఒక దేశంలో కలిసి జీవించే ప్రజలచే ఆమోదించబడిన చట్టాలను రాజ్యాంగం వ్రాసింది. ప్రభుత్వం మరియు పౌరుల మధ్య నమ్మకం మరియు సమన్వయాన్ని సృష్టిస్తుంది. ఒక దేశం కోసం ప్రభుత్వ రకాన్ని మరియు అది ఎలా పని చేయాలో నిర్దేశిస్తుంది. ప్రభుత్వ అధికారాలపై పరిమితులను నిర్దేశిస్తుంది. మన రాజ్యాంగాన్ని తెలుసుకోవడం భారత పౌరుని ప్రాథమిక విధుల్లో ఒకటి. అప్పుడే సార్వభౌమ గణతంత్ర సభ్యునిగా, భారతదేశంలోని ప్రతి పౌరుడు ప్రతిరోజూ వినియోగించుకోవలసిన రాజ్యాంగ హక్కులను పొందుతాడు. ఇందుకోసం ఉన్నత విద్య అవసరం. భారతదేశంలో మనకు దాదాపు 80 శాతం అక్షరాస్యత ఉంది. కానీ ఇంకా, భారతదేశంలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 2024 సంవత్సరం మే నెల లో 28.4 శాతంగా ఉంది. దీని కోసం ఉన్నత విద్యను మెరుగుపరచాలి. ప్రతి పౌరుడి అభివృద్ధి అతని హక్కులు మరియు విధులపై అతని అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ప్రతి రాజ్యాంగం దేశ ప్రగతి కోసం మంచి పాలన మరియు ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని ఇవ్వాలి. ఈ 75 సంవత్సరాల రాజ్యాంగంలో మన భారతదేశం చాలా సాధించింది. 4.27 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) తో మనం 5 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం విషయంలో 5 వ ర్యాంకులో ఉన్నాము, తయారీ రంగంలో మనం 6 వ ర్యాంకులో ఉన్నాము. వ్యవసాయ ఉత్పత్తిలో, వివిధ ఆహార ధాన్యాల, తృణధాన్యాల ఉత్పత్తిలో మనం మొదటి 2 వ స్థానంను ఆక్రమించాము. కానీ దురదృష్టవశాత్తు ఇప్పటికీ ప్రపంచ బ్యాంకు ప్రకారం, 2024 నాటికి భారతదేశంలో 129 మిలియన్ల మంది ప్రజలు అత్యంత పేదరికంలో ఉన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (ఇఋఉ) ప్రకారం, భారతదేశ నిరుద్యోగిత రేటు 2024లో జూన్ నాటిక9.2%. ఆదాయ అసమానతలు చాలా ఉన్నాయి. వివిధ ప్రపంచవ్యాప్త సూచికలలో మనం చాలా వెనుకబడి ఉన్నాము. ఉదాహరణకు ఉగ్రవాద సూచిక 13 వ స్థానం, అవినీతి 93 వ ర్యాంక్, హ్యాపీ ఇండెక్స్ 126 ర్యాంక్ మొదలైనవి. అభివృద్ధి మరియు సంక్షేమం రెండింటి కోసం ప్రవేశపెట్టిన అమలు చేసిన కార్యక్రమాలు పథకాల సంఖ్య చాలా. కానీ ఇప్పటికీ దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయి. ఎందుకంటే విధానాలు ఉత్తమమైనవి. కానీ అమలులో ఇంకా లోపాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సమస్యలన్నింటినీ మనం ఎప్పటికప్పుడు అధిగమించాలి. డీమోనిటైజేషన్, జీఎస్టీ, వ్యవసాయ చట్టాలు వంటి ఇటీవలి విధానాలు ఆర్థిక వ్యవస్థలో సృష్టి ప్రతిష్టంభనలు. ఈ సమస్యలన్నీ తగిన రాజ్యాంగ సవరణలతో పరిష్కరించబడతాయి. పరిస్థితులలో మార్పు ఉంటుంది దానిని ఎదుర్కోవటానికి, సానుకూల ఫలితాలను మరియు సమాజ అభ్యున్నతికి హామీ ఇచ్చే విధానాలను సులభంగా స్థాపించగలిగే విధంగా మన చట్టాలను సవరించడం కొనసాగించాలి. రాజ్యాంగాన్ని సముచితంగా అమలు చేయడానికి రాజకీయ రంగంలో మరియు కార్యనిర్వాహక యంత్రంలో నైతిక విలువలు ఉండాలి, ప్రజలు అవసరమైన చోట ప్రశ్నించే అవకాశం ఉండాలి, ప్రతి పౌరుడు ఇతరుల హక్కులను గౌరవించాలి. చట్టబద్ధంగా మరియు నైతికంగా తన విధులను నిర్వర్తించాలి. అప్పుడు ప్రతి ఒక్కరూ మాత్రమే భారత రాజ్యాంగం యొక్క సారాన్ని ఆస్వాదించగలరు. రాజ్యాంగం మంచిదే అయినప్పటికీ, అమలు యంత్రాలు చెడ్డవి అయితే, రాజ్యాంగం చెడ్డదని, రాజ్యాంగం చెడ్డది అయినప్పటికీ, అమలు యంత్రాలు మంచి అయితే రాజ్యాంగం మంచిదని డా.అంబేద్కర్ గారు సరిగ్గా చెప్పారు.




**- డా. పి.ఎస్. చారి**
8309082823

## మితిమీరిన వ్యాయామం అనర్ధదాయకం

ఈ రోజుల్లో అందరూ ఉదయం, సాయంత్రం వాకింగ్ (నడక ) చేయడం చేస్తున్నారు. కొంతమంది కిలోమీటర్లు, కిలోమీటర్లు నడుస్తున్నారు. దీని వల్ల మోకాళ్ళ నొప్పుళ్ళు వచ్చే అవకాశం ఉంది. సాయంత్రం కంటే ఉదయ కాలం వాకింగ్ శ్రేయస్కరం. వ్యా యామం మంచిదే అయితే మితిమీరి చేయరాదు. ఆరోగ్యం కోసం వ్యాయామమే చేయనక్కరలేదు. ఇంటి పనులు చేస్తున్నా అది వ్యాయామం కిందకే వస్తుంది. ఆడవాళ్లు సవాలక్ష పనులు చేస్తుంటారు. అయినా లావు తగ్గడం కొసం రక రకాల వ్యాయామలు చేస్తుంటారు. దీని వల్ల ఫలితం ఏమి ఉండదు. దానివల్ల వారికి ఆయాసం వస్తుంది. కొందరి శరీర తత్వం అంతే.

చాలా కాలం నుంచి ఒకే బరువు ఉంటే ఇక పెరగడం ఉండదు. బరువు అటు ఇటు చూపిస్తూ ఉంటుంది. మనం తినే ఆహారం కూడా ఎక్కువ తింటే లావు అయితారు అనేది అపోహ. ఎక్కువ తిన్నా, తక్కువ తిన్నా ఒక్కటే. కాకపోతే తిన్న వెంటనే పడుకోకుంటే మేలు. వారం లో ఓ సారి, లేకపోతే రాత్రిళ్ళు పండ్లు, పాలు తాగవచ్చు. కొంతమందికి పాలు సరిపోవు. అటువంటి వారు ఏదైనా ఓ పండు తీసుకున్నా ఫరవాలేదు. అన్నం తింటే లావు అయిపోతారు అని చాలా మంది అంటూవుంటారు. అందులో వరి అన్నం లావు చేస్తుందని చెబుతారు. లావుకు, వరి అన్నం కు సంబంధం లేదు. ఒక వయసు వచ్చిన తరువాత తినక పోతే పలు రకాల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మనిషి లావు ఉన్నా, సన్నగా ఉన్నా సమస్యనే. సన్నగా ఉంటే ఏమైనా అనారోగ్యం ఉందేమో అని, అసలు తిండి తింటున్నావా అని కొంతమంది వేధిస్తారు. లావు ఉన్న వాళ్ళు ఎక్కువ తింటారు అనుకోవడం భ్రమే. నిజానికి లావు ఉన్న వాళ్ళే తక్కువ తింటారు. ఏది ఏమైనా జీర్ణక్రియ సరిగ్గా ఉంటే చాలు.ఆహారం మితంగా తీసుకోవాలి అంటారు. ఆకలి అవుతుంటే మితంగా ఎలా తీసుకుంటారు. అలా మితంగా తీసుకోవడం ప్రమాదమే.

ఎక్కువ తింటే నష్టమే రాదు. ఊరికే కొంతమంది లావు ఉన్న వాళ్ళను గెలి చేస్తుంటారు. అది మంచిది కాదు. మనకు మల, మూత్రాదులు సవ్యంగా వస్తుంటే ఆరోగ్యంగా ఉన్నట్లే లెక్క. ఈరోజుల్లో అనవసరంగా లావు తగ్గాలని 'జిమ్ 'కు వెళ్లడం, ఏవో చిట్కాలు పాటించడం, నెల రోజుల్లో పొట్ట మాయం అని ప్రకటనలు ఇచ్చి కొంతమంది ఆకట్టుకుంటున్నారు. చాలా మంది ప్రకటనలకు మోసపోయి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. లావు తగ్గడం లేదు సరికదా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మనం ఇంటిలో చేసే పనులే శరీరక క్రియ. అంతకు మించి ఏమి అవసరం లేదు. లావు ఉన్న వాళ్ళు అనే కాదు ఎవరైనా సరే ఎటువంటి టెన్షన్స్ పెట్టుకోకుండా ఉంటే చాలు ప్రశాంతత ఉండాలి. సమస్యలు వచ్చినా జడవకూడదు. తృప్తి కర జీవితం ఉండాలి. ఉన్న దాంట్లో సంతోషంగా ఉండాలి. అనవసరమైన విషయాలలో జోక్యం చేసుకోరాదు. మాటకు మాట సరి కాదు. మనది తప్పు ఉన్నా మౌనంగా ఉండటం నేర్చుకోవాలి.

మౌనం అన్నిటికి సమాధానం. వ్యక్తి లావు తగ్గడం కొసం ఎటువంటి వ్యయ ప్రయాసలు అక్కరలేదు. రోజు కొంచెం సేపు ఉదయం, లేదా ఎప్పుడైనా ప్రకృతితో మమేకం కావాలి. కళ్ళు ప్రకృతి చుట్టూ చూడాలి. ఆకాశం వైపు కొంచెం సేపు దృష్టి సారించాలి. మంద్ర స్థాయిలో చక్కని పాటలు వినాలి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ప్రకృతి బాగుంటుంది. ప్రకృతిని చూస్తూ ఉంటే ఏ సమస్యలు రావు. స్థూల కాయం ఉన్న వాళ్ళు, సమస్యలు ఉన్న వాళ్ళు ప్రకృతిని ఆస్వాదించండి అదే మీకు పరిష్కారం చూపిస్తుంది. స్థూల కాయులు కొంతమంది సంవత్సరాల తరబడి వాకింగ్ చేస్తున్న సన్న బడటం లేదు. వాకింగ్ కు సన్న బడటానికి సంభందమే లేదు.వాకింగ్ చేస్తే ఆరోగ్యం బాగుంటుంది అనేది అపోహే. ఏదో ఒక పని ఉండాలి, టైం పాస్ కావాలి అనే వాళ్ళు మాత్రమే వాకింగ్ చేస్తుంటారు. వాళ్ళు అలా మాట్లాడుకుంటూ పరిమితి దాటి పోతుంటారు. అది అనారోగ్యానికి హేతువు. చాలా దూరం పోయి మళ్ళీ ఎవరిదైనా వాహనం వస్తే ఎక్కి కూర్చుంటారు. కొంతమంది తమ వాహనాలు ఎక్కి అవి ఒక చోట పెట్టి వాకింగ్, ఇతర వ్యాయామాలు చేస్తుంటారు. మళ్ళీ ఎక్కేది వాహనమే ఇక ఏమి ప్రయోజనం.అవి తినకూడదు, ఇవి తినకూడదు అని హోరెత్తిస్తూ ఉంటారు. ఇక ఏవి తినేది.


ప్రకృతి తినడానికే అన్ని ఇచ్చింది. కాకపోతే మీకు ఇష్టం లేనివి తిన్నోద్దు. అంతే కాని ఎలా తింటారో అని విమర్శ చేయరాదు. మంచి ఆహారం తీసుకోండి, ఖాళీ కడుపు ఉంచవద్దు. ఎంతో కొంత ఉదరం లోకి వెళ్ళాలి. లావు, సన్నం అనే మాట వీడండి. సాధ్యమైనంత వరకు ప్రశాంతత అలవర్చుకోండి.అంతే కాని మితి మీరిన వ్యాయామం మంచిది కాదు.ప్రశాంతత, తృప్తి, ప్రకృతి మానవునికి కావాలి. అవే వ్యాయామాలు.

**- కనుమ ఎల్లారెడ్డి**

# 'పంజాబ్ కేసరి' లాలా లాజపతిరాయ్



'మీ మీద మీ సామర్థ్యం మీద నమ్మకం ఉంచండి. సమాజంలో మార్పు తెచ్చే సత్తా మీలో ఉంది . అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించండి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడండి'అని లాలా లాజపతిరాయ్ ఇచ్చిన సందేశం ఎందరినో పోరాటంలో పాల్గొనేలా చేసింది. 'దేశభక్తి' అంటే స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన ప్రేమ,ఆత్మగౌరవం కలిగి ఉండడమే అని చెప్పారు. లాలా లజపతిరాయ్ పంజాబ్లోని 'ధుడికే'గ్రామంలో రాధాకిషన్,గులాబ్ దేవి దంపతులకు1865 జనవరి 28న జన్మించారు. తండ్రి నుండి కర్తవ్యం, బాధ్యత, నిర్మోహమాటత, నిజాయితీ, త్యాగాలు, స్వాతంత్ర్య స్ఫూర్తి తన తల్లి నుండి దానం, విశాల హృదయం, సున్నితత్వం, భక్తి వంటి సుగుణాలను వారసత్వంగా పొందారు.1880 ప్రారంభంలో లుధియానాలోని మిషన్ చదువుతున్నప్పుడు పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, మాట్లాడటంపై మక్కువ పెంచుకోవడమే గాక ఎక్స్ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ పై ఆసక్తి చూపిస్తూ నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు. 1886లో హిసార్కు వెళ్లి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. హిసార్ బార్ కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యుడు అయ్యారు. ఆర్యసమాజ్ హిసార్ జిల్లా శాఖను కూడా స్థాపించారు. 1886లో లాహోర్లోని జాతీయవాద దయానంద ఆంగ్లో-వేద పాఠశాలను స్థాపించడానికి మహాత్మా హంసరాజ్కు సహాయం చేశారు. 1905 లో భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ దేశంపై ఆయనలో ఉన్న అంకితమైన చిత్తశుద్ధి, నిస్వార్థ కార్యకర్తను గుర్తించి, భారత ప్రజల రాజకీయ సమస్యలను బ్రిటిష్ ప్రజల ముందు ఉంచే ఉద్దేశ్యంతో ప్రతినిధులలో ఒకరిగా ఎంపిక చేసింది. గోపాల కృష్ణ గోఖలేతో కలిసి ఇంగ్లాండులోని వివిధ ప్రాంతాలలో రాజకీయ ప్రచారాన్ని నిర్వహించారు. స్వదేశీ ఉద్యమం ఊపందుకోవడంతో రాయ్ తన హృదయాన్ని, ఆత్మను అందులో ఉంచి స్వదేశీ సందేశాన్ని బోధించారు. పంజాబ్ ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందారు. ఇది అప్పటి బ్యూరోక్రసీకి కోపం తెప్పించింది. బ్రిటిష్, ఆంగ్లో ఇండియన్ ప్రెస్ చేత 'విప్లవకారుడు'గా పరిగణించబడ్డారు. పంజాబ్ వలస చట్టం, నీటిపారుదల రేట్లు పెంపుదలని వ్యతిరేకించాడు. ప్రభుత్వ దుర్మార్గాలను బయటపెట్టిన వార్తాపత్రిక 'పంజాబీ' పై విచారణ, పంజాబీల మనోభావాలను రేకెత్తించింది. ప్రభుత్వం ఎంతగానో భయపడి 1907 మే 9న లాలా లజపతిరాయ్ను అరెస్టు చేసి మాండలే జైలులో ఉంచింది. విదేశాలలో మన జాతీయవాద ఉద్యమానికి వ్యతిరేకంగా బ్రిటీష్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఏప్రిల్ 1914లో న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి ఇంగ్లండ్కు వెళ్లారు. 1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా లాలా లజపతి రాయ్ను ఎన్నుకుంది.. 1921లో



లాభాపేక్షలేని సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ అనే సంక్షేమ సంస్థను స్థాపించారు. కుల వ్యవస్థ, స్త్రీల స్థానం, అంటరానితనంతో హిందూ సమాజం తన స్వంత పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కులం లేదా లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వేదాలను చదవడానికి, నేర్చుకోవడానికి అనుమతించాలని విశ్వసించారు.జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ ఆమోదించింది. 1921లో అరెస్టయి ఏడాది జైలు శిక్ష అనుభవించారు. 1926 జనవరిలో పండిట్ మోతీలాల్ నెహ్రూ ప్రోద్బలంతో లాలా లజపతిరాయ్ స్వరాజ్ పార్టీలో చేరి దాని ఉపనేతగా ఎన్నికయ్యారు. లాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త, రచయిత, పాత్రికేయుడు,వక్త. మానవతా వాది. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను విముక్తం చేయడంలో దేశ ప్రజలకు సేవచేయడంలో ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా అలుపెరగని పోరాటం చేసారు. లాలాజీ సెంట్రల్ హోమ్, సెంట్రల్ స్కూల్ నిర్మాణం కోసం లాహోర్ లో పెద్ద స్థలాన్ని కొనుగోలు చేశారు. 1908లో లాలాజీ సమీకరించిన కరువు నిధిలో కొంత భాగాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలను కూడా ఈ నిధి నుండి వారి ప్రయోజనం కోసం నిర్వహించారు. ఒక సామాజిక కార్యకర్తగా అస్పృశ్యత, స్త్రీల అభ్యున్నతికి సంబంధించి గొప్ప సామాజిక, ఆర్థిక సిద్ధాంతకర్త. కరవు సహాయక నిర్వాహకుడిగా, కార్మికుడిగా ఆయన పోరాట పటిమ దాదాపు ప్రతి కార్యకలాపంలోనూ తన ప్రభావాన్ని చూపింది. నిరుపేద పిల్లల కోసం అనాథాశ్రమాలు ఏర్పాటు చేసిన ఆయన పథకం అధికారుల నుంచి కూడా ప్రశంసలు, గుర్తింపు పొందింది. ఒక సంఘసంస్కర్తగా ఆయన అంటరానితనం నిర్మూలనకు కృషి చేసే దశలో ఆర్యసమాజ్ ప్రారంభించిన ఉద్యమానికి బలమైన మద్దతు ఇచ్చారు. మహాత్మాగాంధీ హరిజన సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ రంగంలో తన పనిని ప్రారంభించినప్పుడు, సమస్యను మరింత మెరుగ్గా ఎత్తిచూపడంతో ఆయన ఈ సంస్థలో పనిచేయడం ప్రారంభించారు. ప్రపంచంలోని ఇతర ముఖ్యమైన ఉద్యమాల మాదిరిగానే ఈ సంఘసంస్కరణ కూడా జాతీయ ఆమోదం పొందడానికి గొప్ప పోరాటం చేయాల్సి ఉందని ఆయన ప్రకటించారు. రచయితగా కలం పట్టి విభిన్న అంశాలపై రచనలు చేశారు. 1895 నుండి 1900 కాలంలో మజ్జినీ, గరీబాల్డి, శివాజీ, స్వామి దయానంద్ జీవిత చరిత్ర పుస్తకాలు రాశారు. సైమన్ కమిషన్ 30 అక్టోబర్, 1928న లాహోర్ను సందర్శించినప్పుడు, దానికి వ్యతిరేకంగా నిరసనగా లజపత్ రాయ్ అహింసాయుతంగా నిర్వహించిన కవాతుకు నాయకత్వం వహించారు. పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ స్కాట్ నిరసనకారులపై లాఠీ ఛార్జ్ చేయించడమే కాకుండా రాయ్పై వ్యక్తిగతంగా దాడి చేశాడు. తన గాయాల నుండి పూర్తిగా కోలుకోలేక 17 నవంబర్ 1928న మరణించారు.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

## భారత గణతంత్ర దినోత్సవం

ఎందరో మహానుభావులు !
అందరికీ వందనములు !
76 వ భారత గణతంత్ర దినోత్సవ
శుభోదయం ! శుభస్వాగతం !
స్వతంత్ర భారతావనిలో
అమరవీరుల త్యాగం మరువలేము
జోహారు ! జోహారు !

వీరజవాన్లకు జోహారు !
స్వాతంత్ర్య అమర వీరులకు జోహారు
దేశ నాయకులకు జోహారు !
పవిత్రమైన మన భారతీయ సంస్కృతి
కళావైభవం రెపరెపలాడిన
మూడు రంగుల మువ్వన్నెల పతాకం
ప్రగతి కీర్తి పతాకం

భారతీయులందరికీ జైహింద్ నినాదంతో
భారత గణతంత్ర దినోత్సవ
శుభాకాంక్షలు !
జయహో భారత్
జయ జయహో భారత్ !

**- ఎల్. ప్రఫుల్ల చంద్ర**
6300546700

# కులం పేరుతో దూషించలేదు

- దళితుడిని దూషించలేదు
- అన్యాయంగా అట్రాసిటీతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు
- తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే
- ప్రెస్ మీట్‌లో ఆవేదన వ్యక్తం చేసిన మల్లేష్




**లక్షెట్టిపేట, జనవరి 27(మనం న్యూస్):** భూమి విషయంలో మాకు తగిన న్యాయం చేయాలని, అన్యాయంగా తనపై అట్రాసిటీ కేసును అవునూరి రాజయ్య పెట్టడం ఎంత వరకు న్యాయమని మిల్కూరి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాను ఏడాది క్రితం పల్లికొండ రమేష్ వద్ద సర్వే నంబర్ 75/1 లో 2 ఎకరాల 30 గుంటలు కొనుగోలు చేశానన్నారు. నా భూమి పక్కన సర్వే నెంబర్ 76లో మామిండ్ల సత్తయ్య అనే వ్యక్తికి భూమి ఉండగా, అతను సర్వే నెంబర్ 75 లోకి వచ్చి ఈ భూమి నాది అంటూ గొడవలకు కారణం అవుతున్నాడన్నారు. ఇప్పటికే సర్వేయర్ కొలతలు చేసి హద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాకుండా భూమికి సంబంధించిన కోర్టు అనుమతి పత్రాలు కూడా తన వద్ద ఉన్నాయన్నారు. కానీ అవునూరి రాజయ్య అనే వ్యక్తి అనవసరంగా తన భూమి అక్కడ లేకపోయినప్పటికీ అక్కడికి తాను వచ్చినట్లు చెబుతూ, రాజయ్యను కులం పేరుతో దూషించినట్లు అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయమన్నారు. అంతేకాకుండా తన ట్రాక్టర్ ను గుంజుకుని, తన అనుచరుల మీద దాడి చేసినట్లు తెలిపారు. తన డ్రైవర్ ను గోండు వ్యక్తి అని దూషించినట్లు వీడియోలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. కక్ష పూరితంగా అట్రాసిటీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయవద్దని, పోలీస్ అధికారుల విచారణలో నిజాలు బయట పడుతాయన్నారు. తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. తనకు న్యాయం జరుగుతుందన్నారు. అన్నదమ్ములుగా ఉన్నవారిని కులం పేరుతో విడదీయవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం పల్లికొండ రమేష్ మాట్లాడుతూ ఆ భూమిని 30 ఏళ్ల క్రితం కేతిరెడ్డి రాజిరెడ్డి దగ్గర తాము కొనుగోలు చేశామని, ఏడాది క్రితం ఆ భూమిని మిల్కూరి మల్లేష్‌కు విక్రయించినట్లు తెలిపారు. గొడవ జరిగిన ప్రాంతంలో అసలు అవునూరి రాజయ్య అనే వ్యక్తి లేరని, అన్యాయంగా కేసులతో ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పల్లికొండ రంగమ్మ, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## సహస్రను సన్మానించిన బీజేపీ మండల అధ్యక్షులు

**సుల్తానాబాద్, జనవరి 27 (మనం న్యూస్):** సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పసెడ్ల రాజు కుమార్తె సహస్ర ఇటీవల కిలిమంజారో పర్వతారోహణకు వెళ్లి స్వదేశానికి వచ్చిన సందర్భంగా సోమవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సుల్తానాబాద్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ కిలిమంజారో పర్వతం అధిరోహించిన తొలి దక్షిణ భారత దేశానికి బాలిక గా సహస్ర రికార్డ్ సాధించిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సాహసాలు మరెన్నో సాధించి తల్లిదండ్రులకు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లవెల్లి శంకర్, కొల్లూరి సంతోష్, ఇగురం రామస్వామి,పసెడ్ల రాజు, వడ్లకొండ మహేష్ గౌడ్, మల్కా భాగ్యలక్ష్మి, వీరగొని కిరణ్, శేఖర్ మాస్టారు, జోగేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



- కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 27(మనం న్యూస్):** ప్రజావాణిలో చేసే ఫిర్యాదులను వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్ (స్థానిక సంస్థలు), లక్ష్మీకిరణ్ (రెవిన్యూ), ఇతర ఉన్నత అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 298 దరఖాస్తులు రాగా ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగర పాలిక సంస్థకు 45, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి 18, కొత్తపెల్లి తహసీల్దార్ కార్యాలయానికి 13 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూమి సేకరించాలి..: సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతి మండలంలో కనీసం 10 ఎకరాల భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ (స్థానిక సంస్థలు) ఆదేశించారు. ఇందుకు దేవాదాయ శాఖ భూములను పరిగణనలోకి తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మీ లాగిన్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పూర్తిస్థాయిలో ధ్రువీకరించి కలెక్టర్‌కు పంపించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మండలాధికారులను ఆదేశించారు.

## గుర్తు తెలియని యువతి మృత దేహం లభ్యం

**గంగాధర, జనవరి 27(మనం న్యూస్):** గంగాధర మండలం కురిక్యాల గ్రామ శివారు వరద కాలువ దగ్గరలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన, గుర్తుతెలియని యువతి శవం లభ్యం అయినట్లు స్థానిక ఎస్సై నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. యువతి శవం దాదాపు 25 నుంచి 30 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, మృతదేహాన్ని గుర్తుపట్టినవారు 8712670768, 8331940542 నంబర్లకు తెలుప వలసిందిగా ఎస్సై కోరారు.




# ఐ వి వై పాఠశాలలో అట్టహాసంగా స్పోర్ట్స్ ఫియస్టా

**కరీంనగర్ కలెక్టరేట్, జనవరి (మనం న్యూస్):** నగరంలోని సీతారాంపుర్ పరిధిలోగల ఐ వి వై పాఠశాలలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ ఫియస్టా 2024-25, కేంబ్రిడ్జ్ అకాడమిక్ అచీవ్మెంట్ అవార్డ్‌ల కార్యక్రమాన్ని అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పసుల మహేష్ డైరెక్టర్ పసుల జయశ్రీ కో చైర్మన్ శ్రీ దాసరి శ్రీపాల్ రెడ్డి ప్రిన్సిపల్ కోల మాలతి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన గణేష కౌత్వం , శివతాండవ భరతనాట్యంతో సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పసుల మహేష్ కోచైర్మన్ శ్రీపాల్ రెడ్డిలు మాట్లాడుతూ కేం బ్రిడ్జ్ యూనివర్సిటీ పాఠ్య ప్రణాళికను పాఠశాలలో ప్రవేశపెట్టామని దానికి సంబంధించి విద్యార్థులకు ఐ వి వై కేంబ్రిడ్జ్ కరికులం అవార్డ్స్ బెస్ట్ అటెండెన్స్ అవార్డ్స్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్ అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డ్స్ ఇవ్వడం జరిగిందని అలాగే 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించిన స్పోర్ట్స్ ఫియస్టా 2024-25 లో భాగంగా విద్యార్థులు టీం జార్డన్, టీం బోల్ట్, టీం దోని, టీ మెస్సి జట్లుగా ఏర్పడి క్రికెట్, బాస్కెట్ బాల్, హడల్ గేమ్ అథ్లెటిక్స్ మొదలగు ఆటలు ఆడగా గెలుపొందిన వారికి మెడల్స్ ప్రశంసా పత్రాలు గెలిచిన టీం జార్డన్‌కి ట్రోఫీ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. అనంతరం శిక్షకులకు వ్యాయామ ఉపాధ్యాయులను మెడల్స్ ప్రశంసా పత్రాలతో సన్మానించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు స్పోర్ట్స్ ఫియస్టాలో పాల్గొని ఉత్సాహంగా పాల్గొని గెలుపొందిన వారికి మెడల్స్ అందించి సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు దేశభక్తికి సంబంధించిన పాటలు పాడడం, నృత్యాలు చేయడం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం, పీఈటీలు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించిన కలెక్టర్

**సుల్తానాబాద్, జనవరి 27 (మనం న్యూస్):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. టేబుల్ టెన్నిస్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికైన సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఎం. సంప్రీత్, కోచ్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, ఎంఈఓ రాజయ్యలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 4 నుండి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొంటారని



కోచ్ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ విద్యార్థిని, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, కోచ్ సత్యనారాయణ ను అభినందించి శాలువాతో సన్మానించారు. విద్యార్థి జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వస్తాయని, అలాగే రాష్ట్రస్థాయి జాతీయస్థాయి క్రీడలలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**గంభీరావుపేట, జనవరి 27(మనం న్యూస్):** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేడ భాస్కర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సోమవారం సిఎం సహాయనిధి ద్వారా వచ్చిన 92,500 వేల రుపాయల చెక్కును లబ్ధిదారులకు అందించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి వారికి అండగా ఉండడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ



ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు హమీద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి ఆజాం, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏక రాజు, చింతల అనిల్ కుమార్, ముత్యం గారి దేవ గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి కి వెళ్లే దారిని తెరవాలని గ్రామస్తుల ఆందోళన

**జైపూర్, జనవరి 27 (మనం న్యూస్):** గోదావరికి వెళ్లే దారిని తెరవాలని గ్రామస్తులతో పాటు రైతులు ఆందోళన చేపట్టారు. గత కొన్ని వందల సంవత్సరాల నుండి ఉన్నదని దారిని సింగరేణి యజమాన్యం వారు మూసివేయడం సరియైనది కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ నేలపై బైఠాయించి ఆందోళన చేశారు. జైపూర్ మండలంలోని ఇందారం, రామారావుపేట, దుబ్బపల్లి, గ్రామస్తులు కలిసి ఎన్నోసార్లు సింగరేణి జిఎంకి ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్‌కి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. హామీ ఇచ్చిన వారే రాత్రికి రాత్రే మూసివేయడం సమంజసం కాదని రైతులు



నిరసన తెలిపారు. ఇప్పటికే శ్రీరాంపూర్ ఓసిపి, ఇందారం ఓసిపి బాంబు బ్లాస్ట్ లతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, ఓసీ నుంచి వచ్చే దుమ్ముతో గ్రామస్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. చాలా మంది ఇక్కడ ఉండలేకపోతున్నారని, సింగరేణి వల్ల గ్రామం మొత్తం నాశనం అవుతున్నా ఓర్చుకుని బతుకుతున్నాం అని తెలిపారు. సింగరేణి రైతులను ఇబ్బంది పెట్టేలా పొలాలకు, చేన్లకు వెళ్ళే దారిని మూసివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మూసివేసిన రోడ్డును వెంటనే తెరవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ పెద్దల బాపు, రైతులు నామాల నాగరాజు, నామాల మునీందర్, రాజన్న, గోలి వెంకటేష్, అగ్గు రవీందర్, పూదరి సత్తన్న, కొంతం మధుకర్, గోలి కుమార్, జి సత్యనారాయణ, దుర్గం రాజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణి చేసి బాణసంచా కాల్చి సంబరాలు
- దశాబ్దాల పోరాటానికి అరుదైన గౌరవం దక్కిందన్నఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల బాబు...

**చిగురుమామిడి, జనవరి 27 (మనం న్యూస్):** చిగురుమామిడి ఎమ్మార్పీఎస్ మండల వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల చిగురుమామిడి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం సంబరాలు జరిపారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పద్మశ్రీ మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల బాబు మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికి మంద కృష్ణను ఎవరు గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మందకృష్ణను గుర్తించడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. మందకృష్ణమాదిగ 30 ఏళ్ల పోరాటానికి అరుదైన గౌరవం లభించిందని మండల అధ్యక్షుడు దొబ్బల బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ నడిబొడ్డున జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి మండలంలోని ప్రతి గడప నుండి డప్పుతో తరలిరావాలని, గడపకో డప్పు-గ్రామానికో బస్సు నినాదంతో కదిలి రావాలని దొబ్బల బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న, నాయకులు కాతా మల్లయ్య, బోయిని శీను, ఆది మల్లయ్య, ఎడెల్లి సంపత్, మట్టేల లక్ష్మణ్, జిల్లెల రమేష్, వెంకటస్వామి, బత్తుల చంద్రమౌళి, గాదేపాక రవీందర్, కొమ్ముల భాస్కర్, గడిపె కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 16 ఫిర్యాదులు స్వీకరణ
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, జనవరి 27 (మనం న్యూస్):** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై స్పంధించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే సోమవారం ఉదయం10:00 గంటల నుండి 03:00 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ వర్క్ షాప్ నిర్వహణ



- ఎంసీఎంఎఫ్ అలాగే బోధ్ బ్రిడ్జ్ చెన్నైవారి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్

**చిగురు మామిడి, జనవరి 27 (మనం న్యూస్):** చిగురుమామిడి మండల పరిధిలోని ముల్కనూర్ గ్రామంలో ని మోడల్ స్కూల్లో ఎంసీఎంఎఫ్ అలాగే బోధ్ బ్రిడ్జి చెన్నై వారి ఆధ్వర్యంలో 9 , 10 అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కౌన్సిలింగ్ వర్క్ షాప్ నిర్వహించామని ప్రిన్సిపాల్ హర్షిత్ కౌర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధ్ బ్రిడ్జి ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ సీఈవో బాలరాజు కొండవీటి ఇంట్రెస్ట్ ఇన్వెంటరీ టెస్ట్ నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా విద్యార్థులు ఎంచుకోవాల్సిన కోర్సుల గురించి మార్గ నిర్దేశనం చేశారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థుల త్వరగా ఉపాధి అవకాశాలను పొందుటకు ప్రొఫెషనల్ కోర్సులను గూర్చి అలాగే ఒకేషనల్ కోర్సుల గూర్చి వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా రాబోయే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వి. ముక్తి ప్రసాద్, బి. శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా నుండి ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 27 (మనం న్యూస్):** జిల్లా నుండి ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, ఉద్యానవన, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లా ఉత్పత్తుల ఎగుమతి అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, పరిశ్రమల రంగాలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించే



విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి చేస్తూనే అధిక మొత్తంలో ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఉత్పత్తుల ఎగుమతిని పెంచే విధంగా అధికారులు కార్యచరణ రూపొందించి ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. మామిడి, వరిధాన్యం ఎగుమతులపై అధిక దృష్టి సారించాలని, ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్-స్టోరేజ్ సెంటర్లను ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం క్రింద కార్పెంటర్, బోట్ మేకర్, బ్లాక్ స్మిత్, పనిముట్ల తయారీ, లాక్ స్మిత్, శిల్పకారులు, స్వర్ణకారులు, కుమ్మరులు, పాదరక్షల తయారీ, మేస్త్రిలు, బుట్టల తయారీ, దర్జీలు, దోభిలు, మంగలి ఇతర వృత్తులకు సంబంధించి ఆర్థిక చేయూత అందించడం ద్వారా కులవృత్తుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని, పథకంపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపే సింగరాయ జాతర

- రాతిగుహలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహుడు
- తూర్పు నుండి పడమరకు పారే గలగల సెలయేరు
- జాతరకు తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- సంవత్సరంలో ఒక్కరోజే జాతర
- సరిహద్దు వివాదం పరిష్కారమెప్పుడో..?
- టూరిజంగా తీర్చిదిద్దడానికి మంత్రి పొన్నం కృషి
- జాతరకు భారీ బందోబస్తు : సి.ఐ.కొండ్ర శ్రీను

**కోహెడ,జనవరి 27,(మనం న్యూస్):** భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతూ కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ప్రతాపరుద్ర సింగరాయ జాతర రేపే. నృసింహుడి దర్శనం..మహభాగ్యంగా భావిస్తూ సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారిని దర్శించుకోవడాని భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ప్రకృతి అందాలకు ప్రతి బింబంగా ఉన్న ప్రతాప రుద్ర సింగరాయ జాతరను పుష్యబహుళ అమావాస్య రేపు (బుధవారం) రోజున మహదిగ్విజయంగా నిర్వహించుటకు పోలీస్, రెవెన్యూ శాఖలు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోని కోహెడ మండలం కూరెళ్ళ,బస్వాపూర్,తంగళ్ళపల్లి,గుండారెడ్డిపల్లి నాలుగు గ్రామాల సమీపంలో ప్రకృతి అందాలు, పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, గలగల పారే సెలయేరు మధ్య అంగరంగ వైభవంగా ప్రతాపరుద్ర సింగరాయ జాతర జరుగుతుంది. మోయ తుమ్మెద వాగు ఒడ్డున ఎత్తైన కొండల్లో రాతి గుహలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కొలువుదీరారు.స్వామి వారిని దర్శించుకునేందుకు షోలాపూర్, భీవండి, మహరాష్ట్ర, మెదక్, సిద్ధిపేట, కరీంనగర్, వరంగల్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. స్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్ళే దారిలో చతుర్ముఖ బ్రహ్మ కూడా ఉంటాడు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శన ఆనంతరం భక్తులు చతుర్ముఖ బ్రహ్మను కూడా దర్శించుకుంటారు. జాతరలో ముఖ్యంగా ఇక్కడ తూర్పు నుండి పడమరకు పారే గలగల సెలయేరు భక్తులను ఆకర్షితులకు గురి చేస్తుంది.ఈ జాతర కేవలం తెల్లవారుజామున 4 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు (ఒక్కరోజు) మాత్రమే జరుగుతుంది.

**సింగరాయ పేరు ఇలా**

కాకతీయుల కాలంలో ప్రతాప రుద్రుడు ప్రాజెక్టు నిర్మించాలని సింగరాయ అనే ఇంజనీరును ఇక్కడికి పంపగా అతను అక్కడి పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, గలగల పారే సెలయేరును చూసి ప్రకృతి అందాలకు ఆకర్షితుడై అక్కడే ఎత్తైన కొండలో రాతి గుహలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్టించాడని పూర్వీకులు చెబుతుంటారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కొలువై ఉన్నప్పటికి జాతర మాత్రం అతడి పేరు మీదనే ప్రతాప రుద్ర సింగరాయ జాతరగా పిలువబడుతుంది.

**జాతరకు ఇలా చేరుకోవచ్చు**

సిద్దిపేట జిల్లా నుంచి 38 కిలోమీటర్లు, కరీంనగర్ నుండి 45 కిలోమీటర్లు దూరంలో ఈ జాతర జరుగుతుంది.సిద్ధిపేట నుండి రావడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి శనిగరం నుండి కోహెడ కు చేరుకొని అక్కడి నుండి ఆటోలో జాతరకు చేరుకోవచ్చు. రెండోది సిద్ధిపేట నుండి బస్వాపూర్ వరకు బస్సులో వచ్చి అక్కడి నుండి ఆటోలో జాతరకు చేరుకోవచ్చు. కరీంనగర్ నుండి వచ్చే భక్తులు కరీంనగర్ నుండి కోహెడ వరకు బస్సులో లేదా ఆటోలో వచ్చి మళ్ళీ అక్కడి నుండి అటోలో జాతరకు చేరుకోవచ్చు. స్వామి వారిని దర్శించుకోవాలంటే సుమారుగా 3 నుంచి 5 కిలోమీటర్ల వరకు నడిచి మోకాళ్ళ పై దర్శించుకోవాల్సిందే.

**టూరిజంగా తీర్చిదిద్దడానికి మంత్రి పొన్నం కృషి**

గత పాలకులు సింగరాయ జాతరకు రూ.1 కోటి నిధులు కేటాయిస్తున్నామని భక్తులకు మాయమాటలు చెప్పి మోసం చేసారు. గత సర్కార్ సింగరాయ జాతరను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గెలవటంతో మంత్రి అవ్వడంతో సింగరాయ ప్రాంతాన్ని టూరిజంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు చేపట్టినట్లు సమాచారం. త్వరలోనే సింగరాయ జాతర పర్యాటక కేంద్రంగా మారబోతుందని భక్తులు విశ్వసిస్తున్నారు.

తూర్పు నుండి పడమరకు పారుతున్న సెలయేరు దృశ్యం





చతుర్ముఖ బ్రహ్మ



రాతి గుహల్లో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి

## ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కు బిఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



**సిద్దిపేట అర్బన్, జనవరి 27, మనం న్యూస్:** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ నేతలు పాల్గొనడం ప్రోటోకాల్ ఉల్లంఘనే అని, ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బిఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం రోజున సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై బిఆర్ఎస్ నాయకులు గుండు భూపేష్, జాప శ్రీకాంత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డిలు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26న ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా నంగునూరు మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో జరిగిన అధికారిక పథకాల ప్రారంభోత్సవంలో మండల ప్రత్యేక అధికారి డిపిఓ, ఎం.ఆర్.ఓ ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ నాయకులైన పూజల హరికృష్ణ, ఇతర మండల నాయకులను వేదిక పైకి పిలిచి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను ఇప్పించడం ప్రోటోకాల్ ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులను ప్రోత్సహించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు తిరిగి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు రమేష్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, జనవరి 27, మనం న్యూస్ ప్రతినిధి:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిఅర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 117 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా మరియ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ నియోజక వర్గంలోబిటీ రోడ్ల మరమ్మత్తులకు 15 కోట్ల రూపాయల కేటాయింపు

- జి.ఓ.నెం. 59 ద్వారా నిధులను విడుదల చేసిన పంచాయితీరాజ్ శాఖ
- నియోజక వర్గంలో 30.72 కి.మీ.,ల రోడ్లకు మోక్షం
- మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



**హైదరాబాద్, జనవరి 27(మనంన్యూస్):** మెదక్ నియోజక వర్గంలో బిటి రోడ్ల పునరుద్ధణకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ నుండి జి.ఓ.నెం. 59 ద్వారా 15 కోట్ల 10 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి నిధులతో మెదక్ నియోజక వర్గంలో దాదాపు 30.72 కి.మీ.,ల రోడ్లకు మోక్షం లభించనున్నట్లు ఆయన తెలియజేశారు. కాగా మెదక్ మండలంలోని నవాపేట నుండి మగ్దుంపూర్ బిటి రోడ్డు పనులకు 172 లక్షలు, పాపన్నపేట మండలంలోని నాగ్సాన్ పల్లి నుండి కొడపక వరకు బిటి రోడ్డు పనులకు 196 లక్షలు, రామాయంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు నుండి ఆరేపల్లి మీదుగా లక్ష్మాపూర్, కాట్రియాల్, దంతేపల్లి బిటి రోడ్డు పనులకు 424 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని జడ్పి రోడ్డు నుండి మిర్జాపల్లి తాండ బిటి రోడ్డు పనులకు 50 లక్షలు, హావేళిఘణాపురం మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు పొల్కంపేట మీదుగా బూర్గుపల్లి వరకు బిటి రోడ్డు పనులకు 508 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు చందంపేట నుండి రుద్రారం వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షలు, నిజాంపేట మండలంలోని నిజాంపేట మండలం నుండి చల్మెడ వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షల రూపాయలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మెదక్ నియోజక వర్గంలో రోడ్డు లేని పల్లెగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు.

## కుల మతాలకతీతంగా ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు

**సిద్దిపేట, జనవరి 27, మనం న్యూస్ ప్రతినిధి:** ఎన్నో ఏళ్లుగా కులమతాలకు అతీతంగా సిద్దిపేటలోని ముర్షద్ దర్గాలో ప్రతి సంవత్సరం ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఖ్వాజా మహమ్మద్ హకీం షరీఫ్ చిస్తీ అన్నారు. సిద్దిపేటలో ప్రతి సంవత్సరం నిర్వహించే దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముర్షద్ గడ్డ దర్గాలో జనవరి 29 నుండి 31 వరకు ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న సద్గురువుల పవిత్ర సమాధుల స్నానం, గంగారాధన, ఊరేగింపు, 30న దీపారాధన, 31న దివ్య ఖురాన్ పఠనము, వేదాంత హారతితో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు వేద జ్ఞానామృత ఖవ్వాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధం గా దర్గాకు వచ్చే ప్రతి ఒక్కరికి అన్నదానం నిర్వహిస్తామని, ఈ ఉర్సు ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చే యాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనాషీన్, సాబేర్ షరీఫ్ చిస్తీ, ట్రస్టు సభ్యులు అన్జలుద్దీన్ చిస్తీ, నాయబ్ రెడ్డి చిస్తీ, ప్రభుదా స్ చిస్తీ, ఫైజుద్దీన్ చిస్తీ తదితరులు పాల్గొన్నారు.




## బీ స్మాట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీకి అభినందనల వెల్లువ



**సిద్దిపేట రూరల్, జనవరి 27(మనం న్యూస్):** రాష్ట్ర బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీగా సిద్దిపేటకు చెందిన జగ్గు మల్లారెడ్డి ఇటీవల నియామకమైన సంగతి విధితమే. కాగా నూతన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా మల్లారెడ్డి ఎన్నికవ్వడం పట్ల సిద్దిపేటలోని చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ సునయన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనకు పెద్ద ఎత్తున అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ త నపై నమ్మకంతో రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యవర్గానికి, జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలకు ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోగిపేట తహసిల్దార్‌కు వినతి పత్రం

**జోగిపేట, జనవరి 27(మనం న్యూస్):** యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కు వ్యతిరేకంగా సిపిఎస్ ఉద్యోగులందరికీ ఓ పి ఎస్ (ఓల్ పెన్షన్ స్కీమ్) ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పి ఆర్ టి యు ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం పరిధిలోని జోగిపేట తాసిల్దార్ విష్ణు సాగర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షులు సురోత్తం రెడ్డి మాట్లాడుతూ సి పి ఎఫ్ యుపిఎస్ రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం చేయాలని తెలిపారు .కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ విధానాన్ని తీసుకు వస్తున్నట్లు గజిట్ ప్రకటించి మరింత నష్టాన్ని చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్న తీర్పు వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పిఆర్టియు శ్రేణులు తాసిల్దార్ లో వినతి పత్రం ఇచ్చే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తహసిల్దార్ కు ఇచ్చిన వినతి పత్రం కార్యక్రమంలో అందోల్ మండల అర్బన్ రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉత్తంకుమార్, జనార్దన్ గౌడ్, రాజమల్లు, మాయాచారి రాష్ట్ర బాధ్యులు మంజు నాయక్, అనిల్ కుమార్, మహేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



## టి.గౌరారం గ్రామంలో పండగల సాగిన ప్రజాపాలన

- బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు

**డిండి మండలం మనం న్యూస్ జనవరి 27:** దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం టి.గౌరారం గ్రామపంచాయతీ ప్రజా పాలన లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చినా మాటకు కట్టుబడి ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణి నియోజకవర్గం లో చిన్నకోడూరు మండల పరిధిలోనీ టి గౌరారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు గా అధికారులు ఎంపిక చేసి నిజమైన లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో 10ఏండ్ల పాలనలో ఒక్క రెషన్ కార్డు ఇవ్వకుండా మరియు పేదవారికీ ఇండ్లు ఇవ్వకుండా రైతు కూలీలను ఆదుకోకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందాన్నారు. అంతేకాకుండా ఈ నాలుగు పథకాల ప్రొసీడింగ్స్ అందుకున్న టి.గౌరారం గ్రామస్తులు ఆనందం తో కాంగ్రెస్ ప్రభుత్వనికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదములు తెలియజేసారన్నారు త్వరలోనే మండలం లో వున్నా అన్ని గ్రామలా ప్రజలకు నిజమైన లబ్ధిదారులందరికి ఈ నాలుగు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:- రాజ్యాంగం అమలులోకి వచ్చిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా డా,, బి ఆర్ అంబేద్కర్ ఆశయాల్లో భాగంగా ప్రతీ ఒక్క బడుగు బలహీన వర్గాల, నిరుపేద కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు సంక్షేమం పథకాలను ప్రారంభించడం జరిగింది అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేత త్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల పాలన కొనసాగుతుంది అని చెప్పడానికి ఈ సంక్షేమ పథకాలే సాక్ష్యం అని అన్నారు.. వారు పదేళ్లలో ఇవ్వలేనీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అందజేస్తుంటే అభినందించేది పోయి విమర్శిస్తూ, తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను ఆందోళనలకు గురి చేస్తున్నారు అని అన్నారు. ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ.. అర్హులు ఎవ్వరు ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, , పిఎసిఎస్ చైర్మన్ నాగార్జున రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, నల్లవెల్లి దామోదర్ రెడ్డి,వెంకటేష్,పొలం లక్ష్మణ్, రవి,దొంతినేని నాగేశ్వర్ రావు,లోక్యా నాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడ్డమిది సాయి,గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యాటక కేంద్రంగా సింగూర్ ప్రాజెక్టు అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- అధికారులతో కలిసి ౦ంగూరు ప్రాజెక్టు పర్యాటకంగా మార్చడానికి క్షేత్రస్థాయి పర్యటన చేసిన మంత్రి
- ప్రాజెక్టు ఐలాండ్ లోని వాచ్ టవర్ పై రెస్టారెంట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు చర్యలు
- ప్రాజెక్టు దిగువ భాగంలో 29 ఎకరాల్లో రెస్టారెంట్ ఆధునిక కాటేజీల ఏర్పాటుపై ఆదేశం



**సంగారెడ్డి, జనవరి 27 (మనం న్యూస్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సోమవారం సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. సింగూర్ ప్రాజెక్టులో 50 సీట్ల కెపాసిటీ తో నడిచే రెండు అధునాతన సౌకర్యాలతో కూడిన బోట్లు, స్పీడ్ బోట్లను ఏర్పాటు చేయాలని మంత్రి పర్యాటక, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ ,రోడ్ మ్యాప్ లను రూపొందించాలని మంత్రి టూరిజం ,ఇరిగేషన్ ,ఆర్అండ్ బి శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టులో ఉన్న ఐల్యాండ్ లో వాచ్ టవర్ పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కేపింగ్, గార్డెన్ లను అభివృద్ధి పరచాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు దిగువ భాగంలో పర్యటకులను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని 29 ఎకరాలలో ఐదు కోట్ల రూపాయలతో అధునాతన రెస్టారెంట్, 25 అధునాతన కాటేజీలు నిర్మించాలని ఇందులో చిల్డ్రన్ ప్లే ఏరియా , ఫుడ్ కోర్ట్, గార్డెనింగ్, గ్రీనరీ, ల్యాండ్ స్కేటింగ్, పార్కింగ్ ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులు ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సింగూర్ డ్యాం పై భాగంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం డ్యాం పై వెళ్లడానికి అవసరమైన మెట్ల నిర్మాణం ట్యాంక్ బండ్ వెంట పార్కు అభివృద్ధి సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాలలో సెంట్రల్ లైటింగ్ కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారం లోపు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంతో పాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల పర్యాటకులు సింగూరు ప్రాంతంకు వచ్చేలా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సింగూర్ ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకు లకు అధునాతన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు ప్రాజెక్టు దిగువ భాగంలో, ఐలాండ్లో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెద్దపీట వేయాలని దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట ఎక్స్ రోడ్డు నుండి సింగూర్ డ్యాం వరకు రహదారులుగా విస్తరణ చేపట్టాలని రహదారి వెంట అధునాతన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డీఓ పాండు, నీటిపారుదల శాఖ అధికారులు జై భీమ్, నాగరాజు ,ఆర్ అండ్ బి ఇంజనీర్లు రవీందర్ ,జగదీశ్వర్, పర్యటకశాఖ అధికారి నటరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు చేరాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి
- ఖమ్మం15వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన



**ఖమ్మం, జనవరి 27(మనం బ్యూరో):** అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ లో పర్యటించి 8 కోట్ల 45 లక్షలతో అల్లీపురం నుండి రామకృష్ణపురం వరకు, అల్లీపురం నుండి జంగాల కాలనీ వరకు, అల్లీపురం ఎన్.టి.ఆర్. విగ్రహం నుండి ధంసలాపురం వరకు చేపట్టిన 3 రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ,₹ ఆయిల్ పామ్ పంటలు ఇక్కడ కొంత మంది రైతులు బాగా వేసారని, మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్ కు మారాలని, ఎకరానికి 52 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని, మిర్చి, పత్తి, వరి పంటల కంటే అధికంగా లాభం వస్తుందని, మూడు సంవత్సరాల వరకు కూరగాయలు, ఇతర అంతర పంటల వల్ల ఆదాయం వస్తుందని అన్నారు. భూములు ప్రస్తుతం బంగారంతో సమానమని, మన దగ్గర వాతావరణం, ఎరువుల బట్టి తెగుల్లు వస్తున్నాయని, పత్తి, మిర్చి పంటల దిగుబడి తగ్గిపోతుందని, రైతులు ఈ అంశాలను గమనించాలని, ఆయిల్ పామ్ పంటతో కోతుల బాధ, తుఫాను ఇబ్బంది ఉండదని అన్నారు. 15వ డివిజన్ లో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చిన తర్వాత బీటీ రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం మనం చేసే పని 10 కాలాల పాటు ఉండాలని, రోడ్డుపై ర్యాంపులు తొలగించా లని అన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించామని, 500 గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వంటి పథకాలు అమలు చేశామని అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రైతు భరోసా పథకాలు ప్రారంభించామని అన్నారు. పేద ప్రజలకు సంబంధించిన పథకాలు పేదలకు అందేలా చూడాలని, గ్రామాలలో అసలైన అర్హులకు పథకాలు చేరాలని, ఎవరైనా అనర్హులు పథకాలకు ఎంపికైతే అధికారులకు సంపూర్ణ సమాచారం అందించాలని మంత్రి సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 40 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని అన్నారు. రైతు భరోసా కింద వ్యవసాయం చేయని భూములకు సహాయం తొలగించాలని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. అనర్హులకు పథకాలు చేరితే అభివృద్ధి కుంటు పడుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 25 వేల కోట్లు కావాలని, రైతు భరోసా కింద 10 వేల కోట్లు ఇస్తున్నామని, రుణమాఫీ కింద 21 వేల కోట్లు, రైతు బీమా క్రింద 3 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టామని, అక్కడ ప్లాస్టిక్ నిషేధమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహా రావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ యుగంధర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేటర్లు కరుణ, కమర్తపు మురళి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైలారంలోని రాగి గనులను పునరుద్ధరించాలి



- ఆదివాసి, గిరిజనులకు ఉపాధి కల్పించాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మాలోత్ గాంధీ నాయక్ వినతి

**కొత్తగూడెం, జనవరి 27(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం లోని మైలారంలో గల రాగి గనులను పునరుద్ధరించి ఆదివాసి, గిరిజనులకు ఉపాధి కల్పించాలని లక్ష్మీదేవిపల్లి బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ కోరారు. హైదరాబాద్ కేంద్రమంత్రి నివాసంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మాలోత్ గాంధీ నాయక్ మాట్లాడుతూ మైలారంలో గత 40 సంవత్సరాల కితం రాగి గనులు ఉండేవని తెలిపారు. వాటిని మూసివేయడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి లేకుండా పోయిందని తెలిపారు. తిరిగి రాగి గనులను పునరుద్ధరణ చేయించి, ఈ ప్రాంత ఆదివాసి, గిరిజన ఇతర, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి రాగి గనులను తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి వాటిని మునగడలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆ ప్రాంత యువతకు ఉపాధి లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల అధ్యక్షుడు. శంభు. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం నాయక్. హతిరామ్ నాయక్. బాలాజీ నాయక్. శ్రీనివాస్ నాయక్. రామచందర్ తదితరులు పాల్గొన్నారు

## తల్లితండ్రులకు 'నమస్కృతి' అంకితం

- ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం
- గురుదేవ్ ప్రదానోపాద్యాయులు గిరిప్రసాద్
- ముగిసిన వార్షికోత్సవ సంబురాలు



**చర్ల, జనవరి 27 (మనం న్యూస్) :** పిల్లలకు తొలి పలుకులు, బుడిబుడి అడుగులు నేర్పిన మొదటి గురువులు తల్లి తండ్రులేనని గురుదేవ్ విద్యాలయం ప్రదానోపాద్యాయులు హెచ్ జి వి ప్రసాద్ అన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు అంకితమిస్తూ పాఠశాల ఆవరణలో మూడురోజుల పాటు 'నమస్క ృతి' పేరిట సాగిన వార్షికోత్సవ సంబురం సోమవారం ముగిసాయి. మూడవ రోజు కార్యక్రమంను పాత్రికేయ బృందం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పాత్రికేయులను శాలువాలతో సత్కరించారు. ముగింపు కార్యాలయంలో ప్రదానోపాద్యాయులు హెచ్ జి వి ప్రసాద్ విద్యార్థులు, తల్లితండ్రులను ఉద్దేసించి ప్రసంగించారు. పిల్లల బంగారు భవిష్యత్ కొరకు అహర్నిశలు శ్రమిస్తూ జీవితాలను అంకితం చేసే తల్లితండ్రుల త్యాగానికి గుర్తుగా 'నమస్క ృతి' పేరుతో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అమ్మనాన్నలకు అంకిత మిస్తున్నట్లు హర్షద్వానాల నడుమ ప్రకటించారు. ప్రతి విద్యార్థిని కార్యాలయంలో పాల్గొనేలా చేసి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యం పెంపొందించడం తమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. అందుకే కార్యక్రమంను వ్యయప్రయాలకోర్చి మూడు రోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సమయాన్ని కేటాయించిన తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలియ చేసారు. చివరిరోజు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సంస్క ృతిక కార్యక్రమాలు, సందేశాత్మక ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఎకడమిక్ కోఆర్డినేటర్ మల్లాది సుబ్రహ్మణ్యం, జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ



**ఖమ్మం, జనవరి 27(మనం న్యూస్):** ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యత తో పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన జి. మౌనిక తనకు సొంత ఇండ్లు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదని, తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కొణిజెర్ల మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన కుర్రా వీరభద్రం, సర్వేనెంబర్ 298/అ లో ఎకరం భూమి తన భార్య పేరు మీద రికార్డులలో నమోదయిందని, డిసెంబర్ 12, 2016న తన భార్య చనిపోయిందని, ఆ భూమి తన పేరుపై నమోదు చేయాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆ భూమిని ఇతరుల పేరిట మార్పిడి చేసి పట్టా పుస్తకం జారీ చేశారని, దీనిపై విచారణ జరిపి తప్పుడు పట్టాను రద్దుచేసి తన పేరు మీద పట్టా జారీ చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ వెంటనే విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన శీలం నరేందర్ రెడ్డి తమ గ్రామంలో గృహ నివాసాల మధ్య మొబైల్ టవర్ ఉందని, దీనిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మండల పంచాయతీ అధికారికి రాస్తూ ఈ అంశంపై గ్రామసభ నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పువ్వాడ నగర్ గ్రామానికి చెందిన షేక్ సాదిక్ పాషా తాను గతంలో ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించానని, తనకు గత డిసెంబర్ నెలలో మంత్రి పర్యటన సందర్భంగా గ్రామంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని అధికారులకు ఆదేశించారని, తనకు ఇప్పటివరకు ఇండ్లు కేటాయించలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం-సురక్షితంగా గమ్యాన్ని చేరుదాం



- బెల్లంపల్లి ఏసిపి రవికుమార్

**మందమర్రి, జనవరి 27 (మనం న్యూస్):** రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం అని సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందామని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బెల్లంపల్లి ఎసిపి రవికుమార్, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బందితో కలిసి సిఈఆర్ క్లబ్ మందమర్రిలో ఆటో డ్రైవర్లకు, ప్రైవేట్ పాఠశాలల వ్యాన్ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెలంగాణ సాంస్క ృతిక సారథి మంచిర్యాల బృందం వారు పాల్గొని తమ పాటల ద్వారా వాహనదారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయనీ తెలిపారు. ం ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబం మొత్తం పై ప్రభావం చూపుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. లాంగ్ డ్రైవ్ చేసే డ్రైవర్లు విశ్రాంతి ప్రదేశాలలో వాహనాలు ఆపుకొని విశ్రాంతి తీసుకుని సమయస్ఫూర్తిగా వాహనాలు నడపాలని తెలిపారు. పెద్ద పెద్ద వాహన డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్కు చేయాలని సూచించారు. రాత్రి సమయంలో వాహనాలు పార్కు చేసేటప్పుడు పార్కింగ్ లైట్లు తప్పకుండా వేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాత్రి సమయాలలో రోడ్లపై వాహనాలు నిలపవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మజీద్, పోలీస్ సిబ్బంది, తెలంగాణ సాంస్క ృతిక సారథి కళాకారులు, వాహనదారులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు

- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు
- కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని వెల్లడి



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 27 (మనంప్రతినిధి) :** విధుల్లో నిర్లక్ష ్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిషేధిత గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా విధుల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ , కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

- పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి
- పిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి



**మధిర,జనవరి 27(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించకుండా కంటి తడుపు చర్యగా సిపిఎస్ కి బదులుగా యుపిఎస్(యునైటెడ్ పెన్షన్ స్కీమ్) ను 2025 ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని పిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మ రెడ్డి పేర్కొన్నారు. పిఆర్టియు-టిఎస్ రాష్ట్ర జిల్లా శాఖలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం పిఆర్టియు మధిర మండల శాఖ ఆధ్వర్యంలో మధిర తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్ ఆర్.రాంబాబుకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు జరగదని యుపిఎస్ విధానం చాలా లోప భూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న పెన్షన్ స్కీం లో 50% పెన్షన్ హామీ అని చెబుతున్నప్పటికీ ప్రస్తుత పెన్షన్ పథకాలతో పోలిస్తే తక్కువ మొత్తం లభిస్తుందని ఉద్యోగులకు ఎట్టి మాత్రం లాభదాయకం కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న యుపిఎస్ విధానానికి ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం మద్దతు ఇవ్వకూడదని పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి ,పోలే. సుధాకర్ రాష్ట్ర బాధ్యులు ఎస్.కె మదార్, తూమాటి కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి నరసింహారావు, ఎల్ అప్పారావు , ఎండి జమీర్, కె.శాంతబాబు, తెల్ల మేకల శ్రీనివాసరావు, డి శ్యామల రావు , టి అజయ్ కుమార్, చేడే .సతీష్, ఏం నాగేశ్వరరావు, డి లింగయ్య, పిడిపి జ్యోతి , అనసూయ, ప్రమీల, సునీత,మున్నీ జ్యోతిర్మయి,రఘు, జిటి రెడ్డి,నంద, శ్రీనివాస రెడ్డి,నూతన ఉపాధ్యాయులు రామయ్య, కృష్ణవేణి,వెంకట కృష్ణ,సునీల్,గోపి కృష్ణ, నరసింహారావు,నాగేశ్వరరావు,స్నేహిత,లావణ్య,రాజ కుమారి,షాహీధ బేగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్



**జమ్మికుంట, జనవరి27 (మనం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ముందడుగులో ఉన్న జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుండే విధంగా తీర్చిదిద్దుతానని అన్నారు. మున్సిపాలిటీ ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి సరిస్తామని అన్నారు. ముందుగా ప్రత్యేక అధికారి ప్రాఫుల్ దేశాయ్ ని మున్సిపాలిటీ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి. రాజిరెడ్డి, నరేష్, టీపీఓ శ్రీధర్, భాస్కర్, వాణి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 27 (మనంప్రతినిధి):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవార ం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

**గ్రీవెన్స్ ఫిర్యాదులలో కొన్ని ముఖ్యమైనవి....**

పాల్వంచ గాంధీనగర్, ఐదో వార్డు కు చెందిన అలవాల భారతమ్మ గత 50 సంవత్సరాలుగా 11-2-223 ఇంటిలో నివసిస్తున్నామని ఇల్లు కురుస్తున్నందున తమ ఇంటిని తిరిగి నిర్మించుకొనుటకు కూల్చివేసి ఇంటి నిర్మాణ అనుమతి కొరకు మున్సిపల్ అధికారులు సంప్రదించగా మున్సిపాలిటీ నుండి అధికారులు వచ్చి ఫోటోలు తీసుకొని వివరాలు కూడా తీసుకోవడం జరిగిందని, అనుమతుల గురించి అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఇంటి నిర్మాణ అనుమతి లేకపోవడంతో నేను నా భర్త మరియు నలుగురు పిల్లలు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని తమ కుటుంబ సభ్యులు అందరూ కూడా ఆరుబయట నిద్రిస్తుండగా వీధి కుక్కలు వచ్చి తనను కరిచాయని ,ఇదే విషయమై మున్సిపాలిటీ వారికి కూడా తెలియజేయడం జరిగినదని, అయినా కానీ తమకు ఎటువంటి న్యాయం జరగలేదని మాకు ఇంటి నిర్మాణం కొరకు అనుమతులు ఇప్పించాలని చేసిన దరఖాస్తు పరిశీలించి పరిష్కారం నిమిత్తం పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు.పాల్వంచ మండలం, నవభారత్ గ్రామం, గాంధీనగర్ కు చెందిన భూపతి ప్రమీల తన కుటుంబ సభ్యులతో కలిసి 5-4-193 నెంబర్ గల ఇంటిలో నివసిస్తున్నామని ప్రభుత్వ పథకం అయినటువంటి గృహ జ్యోతి పథకానికి తాను అర్హురాలినిగా భావించి దరఖాస్తు చేసుకోని ఉన్నానని నా యొక్క కరెంటు మీటర్ సర్వీస్ నెంబర్ ను గృహ జ్యోతి పథకానికి అర్హురాలు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం ప్రగల్లపాడు గ్రామంలో నివసిస్తున్న భూక్య సుక్య సర్వేనెంబర్ 133 /146 లోగల 1.24 కుంటల భూమి తన తండ్రి హీరామల్ పేరు మీద పాస్ బుక్ ఉన్నదని, దానిని తన పేరు మీదకు మార్చుకొనుటకు పలుమార్లు తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసానని, త్వరితగతిన సమస్యను పరిష్కరించి తన పేరు మీద పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం ఈ సెక్షన్ కు ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండలం చంద్రుకుంట గ్రామానికి చెందిన ఎస్టీ కోయ గిరిజనులు 40 కుటుంబాలు పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని ప్రభుత్వం మాకు పోడు మీద హక్కు పత్రం కల్పించిందని మేము సంవత్సరానికి ఒక పంట మాత్రమే వేసి ప్రస్తుతం మన జీవనం కొనసాగిసు న్నామని మాకు బోర్లు మరియు కరెంటు అనుమ తిస్తే మేము మా గ్రామస్తులం అందరం రెండు పంటల వ్యవసాయం చేస్తూ మా పిల్లల చదువులకు మా అప్పులు తీర్చుకొనుటకు ఆర్థికంగా మాపు ఉపయోగపడుతుందని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం అటవీ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండల ం సీతారాంపురం గ్రామ పంచాయతీ అన్నారంకుచెం దిన గ్రామ రైతులు ముర్రేడు వాగు నందు పిల్లర్ 20 మోటార్స్ వేసే రైతులు వ్యవసాయం చేస్తున్నా మని రాత్రిపూట ఇసుక ట్రాక్టర్ వల్ల నీరు అడుగం టుతున్నాయని వ్యవసాయం చేయడానికి ముర్రేడు వాగులో నీరు ఉండట్లేదని, ములకలపల్లి ఎమ్మార్వో కి చెప్పిన పట్టించుకోవట్లేదని, ఈ రెండు నెలల వరకు ఇసుక ట్రాక్టర్ ను ఆపు చేయగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం ఏ డి మైన్స్ శాఖాధికారికి ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ మాజీ బీసీ కమీషన్ సభ్యుడు తల్లోజు ఆచారిను విమర్శించడం తగదు

- బీజేపీ కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జీ యెన్నం శేఖర్ రెడ్డి...




**కల్వకుర్తి, జనవరి 27(మనం న్యూస్):** జాతీయ మాజీ బీసీ కమీషన్ సభ్యుడు తల్లోజు ఆచారిను విమర్శించడం కాంగ్రెస్ నాయకులకు తగదని బీజేపీ కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జీ యెన్నం శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.జాతీయ మాజీ బీసీ కమీషన్ సభ్యుడు తల్లోజు ఆచారిపై కాంగ్రెస్ నాయకుల మాటల తీరు పట్ల సోమవారం కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జీ యెన్నం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ సీనియర్ నాయకుడు జాతీయ మాజీ బీసీ కమీషన్ సభ్యుడు తల్లోజు ఆచారిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేదిలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల తీరును బీజేపీ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ పూటకో పార్టీ మారే వ్యక్తులా తల్లోజు ఆచారిని విమర్శించేదా అని ఆయన ప్రశ్నించారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రోత్సాహంతోనే కాంగ్రెస్ నాయకులు తల్లోజు ఆచారిపై వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు తల్లోజు ఆచారిపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.ప్రజలకు అమలు కాని హామీలను ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారని సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్,బీసీ మోర్చా ప్రధానకార్యదర్శి రవిగౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యుడు వివేకానంద, సీనియర్ నాయకులు బండెల రామచంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి,రాంభూపాల్ రెడ్డి,సురేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్,నాయకులు బాలస్వామి,గంగాధర్ చారి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరం ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం

- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం
- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి, విద్యావిభాగం, జనవరి 27 (మనం న్యూస్):** ప్రతి ఒక్కరం ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించుదామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కోరారు.ఈనెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా 'జె.ఎస్.రాములు ఫౌండేషన్' స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ ను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అని అన్నారు. సమిష్టి కషితోనే ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, మద్యం సేవించి, అధిక వేగంతో వాహనాలు నడపరాదని చెప్పారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అన్నారు. వనపర్తి జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులు, జాతీయ రహదారి నందు గల హోటళ్లు, వివిధ దుకాణ సముదాయాల యందు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నందు ఈ పోస్టర్ల ద్వారా విస్తతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, వనపర్తి ట్రాఫిక్ ఎస్సై సురేందర్, నిర్వాహకులు జె.సతీష్ రాజు, మహిమరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 27 (మనం న్యూస్):** వనపర్తి జిల్లాలోని ఐదు పురపాలికలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ బాధ్యతలు స్వీకరించారు. జనవరి 26 ఆదివారంతో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల చైర్మన్ లు, కౌన్సిలర్ ల పదవీకాలం పూర్తి కావడంతో సోమవారం నుండి మున్సిపాలిటీలలో కూడా ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం అయింది. ఈ క్రమంలోనే వనపర్తి జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా సోమవారం వనపర్తి పురపాలక కార్యాలయంలో అదనపు కలెక్టర్ బాధ్యలు చేపట్టారు.



## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 27 (మనం న్యూస్):** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జీ.వెంకటేశ్వర్లు తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 67 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ప్రస్తుత సాంకేతికతను జోడిస్తూ బోధించా

- పాఠశాలలకు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు
- నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్



**కల్వకుర్తి, జనవరి 27(మనం న్యూస్):** ఉపాధ్యాయులు ప్రస్తుత సాంకేతికతను ఉపయోగించుకొని విద్యార్థులకు విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలకు సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.విద్యార్థుల విద్య అభ్యున్నతికి పని చేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపైన ఉంటుందన్నారు.ప్రాథమిక స్థాయి నుండి అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా ప్రతి ఉపాధ్యాయుడు బోధనలో మెళకువలు పాటిస్తూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని అన్నారు.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం రూపొందించిన (అపార్ ఐడి) ఆటోమేటేడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ ఐడి ఆన్లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనం తదితర అంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థి సమగ్ర వివరాలను ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించే టీచర్స్,పేరెంట్ సమావేశాలను విధిగా నిర్వర్తించి విద్యార్థుల సామర్థ్యాలు హాజరు తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.అనంతరం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంట కల్వకుర్తి ఎంఈఓ శంకర్ నాయక్,ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 27(మనం న్యూస్):** ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో వివిధ శాఖల అధికారులను సమావేశ పరచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యలపై దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో వారికి తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమం లో సోమవారం వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుండి 65 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.ప్రజావాణి కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూ రికార్డుల ఆదునీకరణకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం

**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 27( మనం న్యూస్):** డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ డిజిటల్ ఇండియా భూరికార్డుల కార్యక్రమం కింద నేషనల్ జియోస్పెషియల్ నాలెడ్జి బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) పేరున ఒక సంవత్సరం పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభించినట్లుకేంద్ర గ్రామీణభివృద్ధి శాఖ డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ సెక్రెటరీ మనోజ్ సిన్హా తెలిపారు. ఈ నక్ష ప్రాజెక్ట్ ఉద్దేశాలు, లక్ష్యాలు,అమలు పై వివిధ రాష్ట్రాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ 26 రాష్ట్రాలు మూడు కేంద్ర పాలిత ప్రాంతాల లోని 152 మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో భూ రికార్డులు నిర్వహణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర వ్యయ విభాగం ఈ ఆర్థిక సంవత్సరం 5000 కోట్ల రూ.లు పెట్టుబడి ప్రోత్సాహకంగా ప్రకటించిందని తెలిపారు. పట్టణ ప్రాంతాలలో భూ రికార్డుల ఆధునికరణకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సంస్థలైన సర్వే ఆఫ్ ఇండియా మరియు ఎన్ఐసి భాగస్వామ్యంతో చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ , రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, సర్వే అండ్ ల్యాండ్ రికారడ్స్ సహాయ సంచాలకులు కిషన్ రావు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, జనవరి 27 (మనం న్యూస్):** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి. అమరేందర్ తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ బాదావత్ సంతోష్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు తమ తమ దరఖాస్తులతో వివిధ శాఖల్లో పరిష్కారాన్ని కోరుతూ నేటి ప్రజావాణికి మొత్తం 50 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**పెబ్బేరు, జనవరి 27 (మనం న్యూస్):** ఫైనల్‌కి చేరిన మన్యం రైడర్స్‌కి రిషి రైడర్స్‌కి ప్రస్తుతం యాంత్రీకరణ వైపు మనుషులు పరుగెడుతున్న సమయంలో క్రీడలు ప్రతిమనిషికి శారీరక, మానసిక ఉల్లాసాలను ఇస్తాయని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం పెబ్బేరు మునిసిపల్ పరిధిలోని పీజేపీ క్యాంపు లో పీపీఎల్-15 క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి కొద్దిసేపు బ్యాటింగ్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరు తనకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని దీంతో వ్యక్తికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం క్రికెట్ కు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉందని యువకులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని తెలిపారు. యువకులు తమకు ఇష్టమైన క్రికెట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రంజీ స్థాయి లో ఎదగాలని కోరారు. గ్రామ స్థాయిలో టోర్నమెంట్ లను నిర్వహించడం ద్వారా స్థానిక క్రీడాకారుల ఆటకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు.గ్రామస్థాయి నుంచి మండల, తాలూకా,జిల్లా,రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని కోరారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం నావంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని గెలుపు కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్ 15 లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టౌన్ అధ్యక్షులు వనం రాములు, దిలీప్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మెన్ కరుణశ్రీసాయినాథ్, వైస్-చైర్మెన్ కర్రె స్వామి, మాజీ మార్కెట్ చైర్మెన్ శ్యామలమన్యం, సీనియర్ నాయకులు విశ్వరూపం జగన్నాథం నాయుడు, పెద్దింటి వెంకటేష్, ఎల్లారెడ్డి, వడ్డే ఈశ్వర్, రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్, గోవిందు నాయుడు, సహదేవుడు, సొప్పరి బీచుపల్లి, కె. బాలస్వామి, మధు, వేణు, మజీద్, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, జనవరి 27 (మనం న్యూస్):** ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఇంటర్మీడియట్ ప్రాక్టిల్ పరీక్షలు, పర్యావరణ విద్య, నైతిక మానవ విలువల పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 3404 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 3187 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుండి 22 వరకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. జనవరి 29న నైతిక విలువలు, మానవ విలువలు, బ్యాక్ లాగ్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, జనవరి 30న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు పరీక్షల సమయానికి నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల

- ఆధునిక సౌకర్యాలతో అధునాతన భవనం
- సామాజిక సేవలో పరిశ్రమలు మరింత చొరవ చూపాలి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**జిన్నారం, జనవరి 27(మనం న్యూస్):** కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా కాజిపల్లి గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిలుస్తుందని.. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామంలో కెమ్ టెక్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో కోటి తొమ్మిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో పాఠశాల నిర్మించడం పట్ల పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమల గ్రామాల పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని కోరారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి నూతనంగా నిర్మించిన పాఠశాలలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు గ్రామ ప్రముఖులు బాధ్యతతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ లు సత్యనారాయణ, నరసింహ, మాజీ ఎంపిటిసి భార్గవ్, పరిశ్రమ ఎండి గుల్లపల్లి గోపికృష్ణ, సంస్థ హెచ్ఆర్ శ్రీనివాస్, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత విద్యారంగం సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది: రాహుల్ గాంధీ

భోపాల్, జనవరి 27: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో



స్వాతంత్ర్యం పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపణలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని మహులో నిర్వహించిన సభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి పరిస్థితులను బీజేపీ, ఆర్ఎస్ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారుస్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు'' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. ''ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉపాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారు'' అని ఆరోపించారు. మరోవైపు, ఆర్ఎస్ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. ''ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు స్వాతంత్ర్యం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి'' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# డ్రైవర్ల కుమార్తెల వివాహానికి రూ.లక్ష

- వారికి ఉచిత ప్రయాణం: ఆప్ మేనిఫెస్టో
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మేనిఫెస్టోను విడుదల చేసిన ఆప్

ఢిల్లీ,జనవరి 27: దేశ రాజధాని ఢిల్లీలో




అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికలకు సంబంధించి మేనిఫెస్టోను ప్రకటించింది. విద్యార్థులు, మహిళల ప్రయోజనాలే లక్ష్యంగా ఆప్ హామీల వర్షం కురిపించింది. పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దీనిని విడుదల చేశారు. ఉద్యోగాల కల్పన, మహిళా సమ్మాన్ యోజన, సంజీవని పథకం సహా తదితర హామీలు ఇందులో ఉన్నాయి. వృద్ధులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పతుల్లో ఉచిత వైద్యం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాలను కల్పిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. వీటితో పాటు పలు సంక్షేమ పథకాలను కొనసాగిస్తామన్నారు. మొత్తం 15 గ్యారెంటీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఐదేళ్లలో ఇచ్చిన అన్ని హామీలను అమలుచేస్తామని అన్నారు.

**ఆప్ గ్యారెంటీలు ఇవీ..**

నిరుద్యోగులు లేని రాజధానిగా ఢిల్లీని మార్చడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగాల కల్పన,మహిళా సమ్మాన్ యోజన పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.2,100, సంజీవని పథకం కింద.. 60 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఉచిత వైద్యం, నీటి సరఫరా బిల్లులు మాఫీ,24 గంటల నీటి సరఫరా, యూరప్లో మాదిరిగా రోడ్ల నిర్మాణం, యమునా నది శుభ్రం చేయడం,డా.అంబేద్కర్ స్కాలర్‌షిప్ స్కీమ్, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఢిల్లీ మెట్రో ప్రయాణంలో 50 శాతం రాయితీ,పూజారులు, గ్రంథీలు ఒక్కొక్కరికి రూ.18 వేలు, కౌలుదారులకు ఉచిత కరెంటుతో పాటు ఉచిత నీటి సౌకర్యం, మురుగు నీటి వ్యవస్థను పరిష్కరించడం, రేషన్ కార్డులు మంజూరు, ఆటో, టాక్సీ, ఈ-రిక్షా డ్రైవర్ల కుమార్తెల వివాహాలకు రూ.లక్ష, వారి పిల్లలకు ఉచిత కోచింగ్, జీవిత బీమా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లకు ప్రైవేటు గార్డులను ఆప్ అందించనున్నదని ఆప్ మ్యానిఫెస్టోలో తెలిపింది.

## లక్షలమంది స్వస్థలానికి..!

గాజా, జనవరి 27: ఇంతకాలం ప్రాణాలు అరచేతపట్టుకొని, శరణార్థి శిబిరాల్లో దాతలు పెట్టిన ఆహారంతో బతుకెళ్లదీసిన వారికి.. సొంతప్రాంతానికి వెళ్లే అవకాశం వచ్చింది. పొట్టచేతపట్టుకొని ఎలా వెళ్లామో అలా తిరిగివస్తుంటే.. తమ స్వస్థలంలో తమకంటూ ఏమైనా మిగిలుందో లేదో తెలియని దుస్థితి వారిని వేధిస్తోంది. సొంతింటికి వచ్చినా సర్వం శిథిలంగా మారిన ఆ ప్రాంతంలో ఎలాబతకాలో తెలియని ఆందోళన వారి హృదయాలను బరువెక్కిస్తోంది. ఇవన్నీ ఆలోచించుకుంటూ లక్షలాది మంది గాజా ప్రజలు దక్షిణంవైపు నుంచి ఉత్తరం వైపు బారులు తీరి వస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

అక్టోబర్ 7, 2023లో ఇజ్రాయెల్ హమాస్ చేసిన దాడితో వారికి కష్టకాలం మొదలైంది. ఆ దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ ప్రతిదాడి మొదలుపెట్టడంతో ఉత్తరగాజా నుంచి సుమారు



10 లక్షల మంది దక్షణాదికి తరలివెళ్లిపోయారు. శరణార్థి శిబిరాల్లో కాలం వెళ్లదీశారు. ఉత్తర ప్రాంతంలో బెంజమిన్ నెతన్యాహు సేనల దాడులతో ఆ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి సౌకర్యాలు శిథిలమయ్యాయి. ఈ ఘర్షణలో హమాస్ అగ్రనాయకత్వం నిర్వీర్యమైంది. ఈ నేపథ్యంలో హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. దాంతో సుమారు 15 నెలల తర్వాత పాలస్తీనా పౌరులు తమ సొంత ప్రాంతాలవైపు బారులు తీరారు. చేతిలో తమ వస్తువులు పట్టుకొని పిల్లల్ని చంకనేసుకొని మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకూడదనుకుంటూ నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు హృదయాలను మెలిపెట్టేస్తున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఓ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు గాజా పొరుగునే ఉన్న ఈజిప్టు, జోర్డాన్లు పునరావాసం కల్పించాలన్నారు. ఈ ప్రతిపాదన వారిని తమ సొంత ప్రాంతానికి శాశ్వతంగా దూరంగా చేస్తుందా..? అనే ఆందోళనా వ్యక్తమైంది. ఇక పాలస్తీనా వాసులు తిరిగి రావడాన్ని హమాస్ విక్టరీగా అభివర్ణించుకుంది.

# పరస్పర అవగాహన.. మద్దతే ఇరుదేశాలకు ప్రయోజనం

- భారత్-చైనా పరస్పరం విశ్వాసంతో పనిచేయాలని ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్యీ




బీజింగ్, జనవరి 27: భారత్, చైనాలు పరస్పర మద్దతు, లక్ష్య సాధనలకు ప్రాధాన్యమివ్వాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్యీ అభిప్రాయపడ్డారు. భారత్ విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీతో ఆయన నేడు బీజింగ్‌లో సమావేశమ్యారు. పరస్పరం అనుమానాస్పద దృష్టితో చూడటం, దూరంగా ఉంచడం వల్ల ప్రయోజనం లేదన్నారు. గతేడాది జిన్‌పింగ్-మోదీ సమావేశం తర్వాత పరిణామాల్లో వేగంగా మార్పులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ''అవకాశాలను ఇరు పక్షాలు అందిపుచ్చుకోవాలి. ఇద్దరూ ఒక అడుగు ముందుకేయాలి. మరిన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలి. ఇరు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాల ఆధారంగానే సంబంధాలు ఉంటాయి'' అని వెల్లడించారు. విక్రమ్ మిస్త్రీ చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఇంటర్నేషనల్ డిపార్ట్మెంట్ అధిపతి లూజియాన్‌చవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలు ఒప్పందాల అమలుపై అభిప్రాయాలను పంచుకొన్నాయి. ఆ తర్వాత ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి సన్ వీడాంగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాలకు చెందిన ఉన్నతాధికారులు ఒకే నెలలో రెండు సార్లు సమావేశం కావడం విశేషం. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నాలుగేళ్లుగా కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ గతేడాది ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగుతుందని, ఇరుదేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చని రెండు దేశాలు ఒప్పందంలో పేర్కొన్నాయి. దానిలో భాగంగా కీలక ప్రాంతాల నుంచి ఇరుదేశాల సైనికులు తమ మౌలిక సదుపాయాలను, ఇతర సామగ్రిని వెనక్కి తీసుకున్నట్లు ఆర్మీ వర్గాలు ఇటీవల వెల్లడించాయి.

# కృత్రిమ మేధతో పనిచేసే క్షిపణులు మోహరించిన ఇరాన్..!

టెహరాన్, జనవరి 27:ఇరాన్ తాజాగా కృత్రిమమేధ సాయంతో పనిచేసే క్షిపణులను మోహరించింది.

కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే అత్యాధునిక క్షిపణులను ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలో మోహరించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ రంగ మీడియా వెల్లడించింది. ''ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ ఘెహమ్,



అల్మాస్ క్షిపణులను ప్రయోగించింది. ఇవి కృత్రిమ మేధ ఆధారంగా పనిచేస్తాయి. ప్రయోగం సందర్భంగా ఇవి విజయవంతంగా లక్ష్యాలను ఛేదించాయి'' అని ఐఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఘెహమ్, అల్మాస్ క్షిపణులను ఇరాన్ దేశీయంగానే అభివృద్ధి చేసింది. ఇటీవల బుషెహర్, ఖుజెస్థాన్ ప్రాంతాల్లో వరుసగా చేపట్టిన యుద్ధ విన్యాసాల్లో వీటి సామర్థ్యాన్ని పరీక్షించింది. ఈ ప్రాంతంలో ఆ దేశ అణు విద్యుత్తు ప్లాంట్ ఉండటంతోపాటు.. పెట్రోకెమికల్ కాంప్లెక్సులున్నాయి. ఇప్పటికే ఇరాన్ కృత్రిమమేధ సాయంతో 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణులను కూడా అభివృద్ధి చేస్తోంది. ఏఐపై పట్టు సాధించాలని ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీఖమేనీ వెల్లడించిన నేపథ్యంలో ఈ పరీక్షలు జరగడం విశేషం. 1979 నుంచి ఈ దేశం వరుసగా పలు రకాల మిసైల్స్‌ను అభివృద్ధి చేస్తూ వస్తోంది.

# ఉదయనిధికి సుప్రీంలో ఊరట

- సనాతన ధర్మంపై వ్యాఖ్యల కేసు

ఢిల్లీ,జనవరి 27: తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మంపై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన మూడు రిట్ పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఇవి ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించిన జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ధర్మాసనం.. ఈ పిటిషన్లను తోసిపుచ్చింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. ''సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి'' అంటూ వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు. అనంతరం తన వ్యాఖ్యలు ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశంతో చేసినవి కావని పేర్కొన్నప్పటికీ.. హిందూ సంఘాల నుంచి తీవ్ర



వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సనాతన ధర్మంపై వ్యాఖ్యల నేపథ్యంలో దాఖలైన మూడు రిట్ పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది.

## 'మ్యాన్ ఈటర్' మృతి

తిరువనంతపురం, జనవరి 27: వయనాడ్ జిల్లాలో ఇటీవల ఓ మహిళపై దాడి చేసి చంపిన పులిని అక్కడి ప్రభుత్వం మ్యాన్ ఈటర్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఆ పులి మృతి చెందినట్లు అటవీ శాఖ ప్రకటించింది. సోమవారం తెల్లవారుజామున పులి కళేబరాన్ని అటవీ ప్రాంతంలో గుర్తించినట్లు పేర్కొన్నారు.



పులి శరీరంపై ఉన్న గాయాల ఆధారంగా మరో క్రూర మృగం దాడిలో అది మరణించి ఉంటుందని అనుమానిస్తున్నట్లు చీఫ్ ఫారెస్ట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ అరుణ్ జకారియా తెలిపారు.

మ్యాన్ ఈటర్‌గా మారిన పులిని చంపాలని ప్రభుత్వం ఆదేశించడంతో దానిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశామని.. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో పులి ఉనికిని గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. అయితే సోమవారం తెల్లవారుజామున దాని కళేబరం గాయాలతో లభ్యమయ్యిందని అన్నారు. ఇటీవల ప్రజలు పులులను చూసినట్లు నివేదించిన అన్ని ప్రాంతాలలో అటవీ అధికారులు క్షుణ్ణంగా గాలింపు చర్యలు చేపడుతున్నారని కేరళ అటవీశాఖ మంత్రి ఏకే శశీంద్రన్ పేర్కొన్నారు. వయనాడ్‌లోని మనంత వాడి సమీపంలోని కాఫీ తోటలో పనిచేస్తున్న రాధ (45) అనే మహిళపై ఇటీవల పెద్దపులి దాడి చేసి.. ఆమె మృతదేహంలో కొంత భాగాన్ని తినేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అటవీశాఖ అధికారి జయసూర్యపైనా పులి దాడి చేసింది. ఇలా వరుస దాడులకు పాల్పడుతుండటం, ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. దీంతో ఆ పెద్దపులిని చంపేయాలని ప్రభుత్వం అటవీశాఖ అధికారులను ఆదేశించింది.

# సైఫ్ అలీఖాన్ కేసు..

## గందరగోళం సృష్టించొద్దు: సీఎం ఫడ్నవీస్

ముంబయి,జనవరి 27: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి అంశంపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఈ దాడి ఘటనపై వస్తోన్న ఊహాగానాలు, పోలీసులు వెల్లడించని అంశాల ఆధారంగా ఎవరూ గందరగోళం సృష్టించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. అన్ని విషయాలనూ నేడో, రేపో మీడియాకు వెల్లడించాలని ముంబయి నగర పోలీస్ కమిషనర్‌కు చెబుతానని తెలిపారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగానే భారతీయ సాక్ష్యాధార వ్యవస్థను అమలు చేసిన మొదటి రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని ఫడ్నవీస్ అన్నారు. మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను




ప్రారంభించామని.. ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఈ వాహనం ఏ ఘటన జరిగినా ఆ కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తుందని చెప్పారు. అందువల్ల ఇప్పుడు ఎవరూ ఆధారాలను తారుమారు చేయలేరన్నారు. సేకరించిన ఆధారాలను భద్రంగా ఉంచేలా అవసరమైన ఏర్పాట్లన్నీ వ్యాన్లో ఉన్నాయని తెలిపారు. ఈ వ్యాన్లను అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచుతామని సీఎం తెలిపారు. సైఫ్ అలీఖాన్‌పై జనవరి 16న దాడి జరగడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సైఫ్ అలీఖాన్ ఆ తర్వాత ఆస్పత్రిలో చేరి చికిత్సపొంది ఆ తర్వాత డిశ్చార్జి అయ్యారు. ఈ ఘటనపై ముంబయి పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. తాజాగా బెంగాల్‌కు చెందిన ఓ మహిళను అరెస్టు చేశారు. సైఫ్‌పైదాడి చేసిన నిందితుడు వినియోగించిన సిమ్ కార్డు ఈ మహిళ పేరుతో ఉన్నట్లు గుర్తించారు. ''నదియా జిల్లా చప్రాకు చెందిన మహిళకు సైఫ్‌పై దాడి చేసిన నిందితుడితో పరిచయం ఉంది. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాడు. అప్పటినుంచి ఈ మహిళతో టచ్‌లో ఉన్నాడు'' అని పశ్చిమ బెంగాల్ పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ముంబయి నుంచి వచ్చిన పోలీసులు ఈమెను అరెస్టు చేశారని చెప్పారు. మరోవైపు సైఫ్ అలీఖ్పా దాడి కేసులో అరెస్టయిన షరీఫుల్ ఇస్లాం వేలిముద్రలు, దాడి జరిగిన ప్రదేశంలో లభించిన వేలిముద్రలతో సరిపోలడం లేదని వార్తలు వచ్చాయి. దీంతో తదుపరి పరీక్షల కోసం మరోసారి ఘటనా స్థలం నుంచి మరిన్ని నమూనాల్ని సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు. ఇలా ముమ్మర దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే మహిళను అరెస్టు చేశారు.


## హసీనా కుటుంబంపై బంగ్లా ప్రభుత్వం ప్రతీకారం

ఢాకా, జనవరి 27: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుటుంబంపై యూనస్ సర్కారు చర్యలు చేపట్టడం మొదలుపెట్టింది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుటుంబాన్ని ఇబ్బందిపెట్టేందుకు అక్కడి ప్రభుత్వం వెనుకాడటం లేదు. ఇప్పటికే పలు కేసుల్లో ఆమె కుటుంబసభ్యుల పేర్లను చేర్చిన యూనస్ సర్కారు తాజాగా ఆమె కుమార్తె సైమా వాజెద్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ పదవి నుంచి తప్పించేలా పావులు కదుపుతోంది. ప్రస్తుతం సైమా డబ్ల్యూహెచ్‌వో ఆగ్నేయ ఆసియా ప్రాంతీయ డైరెక్టర్‌గా



విధులు నిర్వహిస్తున్నారు. ఈమె ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్నారు. వృత్తిరీత్యా సైకాలజిస్ట్ అయిన సైమా.. నాడీ సంబంధ రుగ్మతలపై పని చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ ఆమెను ప్రాంతీయ డైరెక్టర్‌గా ఎంపిక చేసింది. దీంతో 2024 జనవరిలో ఆమె బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్ ప్రభుత్వానికి చెందిన యాంటీ కరెప్షన్ కమిషన్(ఏసీసీ) సంస్థ తన దర్యాప్తులో సైమాపై పలు ఆరోపణలు చేసింది. ఇక చర్యలు తీసుకోవడానికి వీలుగా ఆ సంస్థ పావులు కదుపుతోంది. 'ఆమెను డబ్ల్యూహెచ్‌వో పదవి నుంచి తప్పించేందుకు ఏసీసీ ఇప్పటికే పలు చర్యలు తీసుకొంది. ఇందులోభాగంగా ఏసీసీ దేశంలోని వైద్య, విదేశాంగశాఖలకు లేఖలు పంపేందుకు అంతా సిద్ధం చేశాం' అని ఓ అధికారి పేర్కొన్నారు. మరోవైపు షేక్హసీనాను అరెస్టు చేయడానికి కూడా బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అవసరమైతే అంతర్జాతీయ మద్దతు కూడగడతామని వెల్లడించింది. ఈక్రమంలో అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ ఇప్పటికే అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఇక ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ న్యూఢిల్లీకి పలు మార్లు లేఖలు రాసింది. హసీనా ప్రభుత్వం అనంతరం అధికారం చేపట్టిన మహమ్మద్ యూనస్ హయాంలో భారత్తో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అంతేకాదు.. పాక్తో ఢాకా అంటకాగుతోందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.

## అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం



వాషింగ్టన్,జనవరి 27: అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్ ట్రంప్.. వచ్చీ రాగానే అక్రమ వలసదారులను దేశం నుంచి బయటకు పంపే ప్రక్రియను వేగంగా నిర్వహిస్తున్నారు. చెప్పినట్టుగానే అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఆయన అనుసరిస్తోన్న విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అక్రమ వలసదారుల్ని గుర్తించే క్రమంలో గురుద్వారాలనూ వదలడం లేదు. హెమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి చెందిన అధికారులు న్యూయార్క్, న్యూజెర్సీల్లోని ఈ ప్రార్థనా మందిరాల్లోనూ తనిఖీలు చేయడంపై సిక్కు సంస్థలు మండిపడుతున్నాయి. గురుద్వారాల పవిత్రతకు ఈ చర్య ముప్పుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వేర్పాటువాదులు, అధికారిక పత్రాలు లేని వలసదారులు వీటిని ఉపయోగించుకోవచ్చంటూ అమెరికా స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.''ట్రంప్ యంత్రాంగం ఇప్పటివరకూ వందలమంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, లైంగిక నేరాలు వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నవారే. ఇక, అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. సైనిక విమానాల్లో వందల మంది అక్రమ వలసదారులను దేశం నుంచి బయటకు పంపించేశాం. ఎన్నికల్లో ట్రంప్ తాను ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు'' అని వైట్‌హౌస్ వెల్లడించింది. మరోవైపు, అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఎందుకంటే అది పలురకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని ఇప్పటికే భారత్ స్పష్టం చేసింది. అయితే, వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాలో ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చే వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. సంబంధిత డాక్యుమెంట్లను తమతో పంచుకుంటే వాటిని పరిశీలించి స్వదేశానికి తీసుకువస్తామని పేర్కొంది.

# ట్రంప్ దెబ్బకు దిగొచ్చిన కొలంబియా

వాషింగ్టన్, జనవరి 27: కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు కొలంబియా దిగొచ్చింది. ఈ విషయాన్ని వైట్‌హౌస్ తాజాగా వెల్లడించింది. అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. వారందరినీ ప్రత్యేక విమానాల్లో స్వదేశాలకు పంపిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ చర్యను కొలంబియా తీవ్రంగా వ్యతిరేకించింది. వలసలతో వస్తున్న అమెరికా సైనిక విమానాలను తమ దేశంలోకి అనుమతించేది లేదని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో స్పష్టం చేశారు. వలసదారులన గౌరవంగా పంపించేందుకు నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే తమ దేశంలోకి వచ్చిన అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపినట్లు చెప్పారు. అయితే, గుస్తావో పెట్రో నిర్ణయంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకాలతో పాటు కఠిన వీసా ఆంక్షలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు కీలక ప్రకటన చేశారు.

అంతేకాదు కొలంబియన్ ప్రభుత్వ అధికారుల వీసాలను వెంటనే రద్దు చేస్తానని తెలిపారు. ఈ క్రమంలోనే కొలంబియా దిగొచ్చినట్టు తెలుస్తోంది. ట్రంప్ విధానాలకు ఓకే చెప్తూ.. అక్రమ వలసదారులు అందరినీ స్వీకరించేందుకు కొలంబియా అంగీకరించినట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. శరణార్థులను తీసుకొస్తున్న అమెరికా మిలిటరీ విమానాలపై ఎటువంటి ఆంక్షలు, జాప్యం ఉండదని అక్కడి ప్రభుత్వం పేర్కొన్నట్టు తెలిపింది. ఇక కొలంబియా వెనక్కి తగ్గడంతో ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.

# యువకుడు దారుణ హత్య

- తలపై బండరాయితో కొట్టి చంపిన ఆనవాళ్లు
- మృతుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ ( బంటి) గా గుర్తింపు
- ఆరు మాసాల క్రితం కులాంతర వివాహం
- నమ్మించి ఇంట్లో నుండి తీసుకెళ్లి చంపారంటూ రోధిస్తున్న భార్య భార్గవి బంధువులు
- నా భర్త చావుకు తమ కుటుంబ సభ్యులే కారణం అంటున్న భార్య
- పరువు హత్యకు కారణమైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలి కుల సంఘాల డిమాండ్



**సూర్యాపేట, జనవరి 27 (మనం ప్రతినిధి):** సూర్యాపేట పట్టణంలోని మామిళ్ళగడ్డ కు చెందిన వడ్లకొండ కృష్ణ (బంటి )అనే యువకుడి బండరాయితో మోడీ హత్య చేసిన సంఘటన సోమవారం జనగామ రహదారి నుంచి పిల్లలమర్రి కి వెళ్లే మూసి కెనాల్ కట్టపై పడి ఉన్న మృతదేహం పరిశీలిస్తే తెలుస్తోంది. మృతుని భార్య భార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ (బండి) తాను ప్రేమించుకున్నామని తమ ఇంట్లో మా ప్రేమను ఒప్పుకోకపోవడంతో ఆరు మాసాల క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకోవడం జరిగిందని తెలిపింది. దీంతో అప్పటినుండి తమ తల్లిదండ్రులు సోదరులకు ఈ వివాహం ఇష్టం లేకపోవడం తో తాము పట్టణంలోని తాళ్లగడ్డలో నివాసం ఉంటున్నామని, వేరే కులం వాడిని పెళ్లి చేసుకుంటావా అని తమ సోదరులు కోపంతో ఉన్నారని. దీంతో కుటుంబ సభ్యులతో అప్పటినుండి దూరంగా ఉంటూ జీవిస్తున్నామని. కన్నీటి పర్వతం అయింది. ఆదివారం సాయంత్రం సమయంలో ఓ వ్యక్తి నమ్మించి తన భర్తను ఇంటి నుండి తీసుకెళ్లాడని ఇంతలోనే తన భర్త శవమై కనిపించడంతో భార్య భార్గవి బోరున విలపించింది. తన భర్త చావుకు కారణం తన తరపు కుటుంబ సభ్యులేనని కులాంతరం వివాహం చేసుకున్న ఆగ్రహంతో తమను విడదీయడానికే తన భర్తను చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది తన భర్త చావు కారణమైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

**పరువు హత్య కోణంలో పోలీసుల దర్యాప్తు....**

మృతి చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ (బంటి) దారుణంగా హత్య గుడి కావడం తీరును చూస్తే పరు హత్య కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది అంతేకాకుండా మృతునికి గతంలో ఏమైనా ఇతర ఘర్షణలు ఉన్నాయా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే హత్యకు పాల్పడిన నిందితులకు పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడతామని డీఎస్పీ రవి తెలిపారు.

**నిందితుల్ని కఠినంగా శిక్షించాలి కుల సంఘాల డిమాండ్...**



కులాంతర వివాహం చేసుకున్న వడ్లకొండ కృష్ణ (బంటి) నీ బండరాయితో కిరాతకంగా హత్య చేసిన నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బిడ్డ అయిన కృష్ణ ప్రేమించి పెళ్లి చేసుకోవడం నేరమా అని ప్రశ్నించారు. కుల వివక్షతో ఇలా చంపిన సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని వీటిని రూపుమాపేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జనవరి 27 (మనం న్యూస్):** మండల పరిధిలోని గల రాముని గుండ్ల తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రమావత్ మంగ్తా నాయక్ మృతి చెందిన విషయం తెలుసుకొని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కొండమల్లేపల్లి మండల పరిధిలోని గల రాముని గుండ్ల తండా వారి స్వగృహంలో రమావత్ మంగ్తా నాయక్ భౌతిక కాయాన్ని నివాళులర్పించారు. ,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్...వారితో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, (ఐఅఇట చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్,మాజి ఎంపీటీసీ లాలు నాయక్,మాజి సర్పంచ్లు రామావత్ అరుణ సక్రు నాయక్,రమావత్ రవి నాయక్,బాల్ సింగ్, జేమ్లా నాయక్,కోట్ల జగదీశ్,మోహన్ తదితరులు పాల్గొన్నారు .



## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



- రోడ్డు భద్రతా నియమాలు నిబంధనలు పాటించాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**కొండమల్లేపల్లి, జనవరి 27 (మనం న్యూస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఈ సంవత్సరంలో జిల్లాలో యాక్సిడెంట్ ఫ్రీ యే లక్ష్యంగా నల్లగొండ జిల్లా, కొండమల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మిషన్ త్రిబుల్ ఆర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎఎస్పి మాట్లాడుతూ దీని యొక్క ముఖ్య ఉద్దేశం జిల్లాలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా,రోడ్డు నియమాలు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా అతివేగంగా వాహనాలు నడుపుతూ అనేక ప్రమాదాలకు గురి అవుతున్నారని,వాహనాలు నడిపే సమయంలో తమ ప్రాణాలనే కాకుండా తమపై ఆధారపడి కుటుంబ సభ్యులను దృష్టిలో వుంచుకొని వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని అన్నారు.వాహనదారులు వాహన వేగం నిర్ణీత వేగం తగ్గించి నడపడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు.అలాగే డ్రంక్అండ్డ్రైవ్, అతివేగం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించుట హెల్మెట్ లేకుండా ప్రయాణించడం లాంటి సమయంలో రోడ్డు ప్రమాదం సంబవిస్తే అధిక ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని జాగ్రత్తలు పాటిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు కావలసిన తగు చూచనల పైన గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రమాదాల నివారణకు విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు ప్రమాదాలకు గల కారణాలు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ప్రమాదాల జరిగినప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కొత్త మోటార్ వాహనాల చట్టం యొక్క రూల్స్ పెరిగిన పైన వివరాలు తెలియపరిచినారు అదే విధంగా దేవరకొండ డివిజన్లో ప్రమాదరహిత డివిజన్ గా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వివరిస్తామని ఈ సందర్భంగా ఏఎస్పీ దేవరకొండ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ పి మౌనిక, కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్సై రామూర్తి డి.టి.ఆర్బి పోలీస్ కళాబృందం స్థానిక పెద్దలు, 500 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- ప్రతి ల్యాబ్ లో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలి
- పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ,జనవరి 27 (మనం ప్రతినిధి):** ఈనెల 29 నుండి ఫిబ్రవరి 22 వరకు, అలాగే మార్చి 5 నుండి మార్చి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమం అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సంవత్సరం నిర్వహించనున్న ఇంటర్మీడియట్ రెగ్యులర్ ,ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా ప్రతి ల్యాబ్ లో తప్పనిసరిగా 2 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు .ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల?ల్యాబులలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని, ప్రైవేటు కళాశాలల్లో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబులలో తప్పనిసరిగా యాజమాన్యాలు ఏర్పాటు చేయాలని ఒక వేళ లేనట్లయితే ఆ కళాశాలలకు ప్రాక్టికల్ ,థియరీ పరీక్షల కేంద్రాలను రద్దు చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ఈనెల 29న ఎథికల్, హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామినేషన్ ,30న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్, ఈనెల 31 మరియు ఫిబ్రవరి 1న ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉంటాయని తెలిపారు .ఫిబ్రవరి 3 నుండి 22 వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ప్రతిరోజు రెగ్యులర్ ,ఒకేషనల్ విద్యార్థులకు రెండు పూటల ఉదయం 9 నుండి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అలాగే మార్చి 5 నుండి 25 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు కూడా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, బందోబస్తు, జిరాక్స్ కేంద్రాల మూసివేత ,144 వ సెక్షన్ విధింపు, తదితర విషయాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రునాయక్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు ,గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## నిరంతర పరిశోధనలు, ప్రచురణలు విశ్వవిద్యాలయ ప్రగతికి కొలమానాలు

- ఉపకులపతి ప్రొఫెసర్ కాజా అల్తాఫ్ హుస్సేన్

**నల్లగొండ, జనవరి 27 (మనం న్యూస్):** నిరంతర పరిశోధనలు ప్రయోగాలు విశ్వవిద్యాలయాలకు కొలమానాలు అని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు ఆచార్య మిట్టపల్లి వసంత అడ్వాన్స్ ఆఫ్ టు హెటిరిల్ అండ్ హెట్రీ హెట్రి అల్కీల్ క్వినాజోలిన్ మూలకం విశిష్టతలు వినియోగం పై సమీక్ష గ్రంధాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో మేలైన పరిశోధనలు ప్రచురణలు జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, ఓ ఎస్ డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, డా ప్రశాంతి, ఆచార్య రేఖ, ఆచార్య సరిత పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**భువనగిరి, జనవరి 27(మనం న్యూస్):** వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. సోమవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 42 అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 19, హౌసింగ్ 5, వ్యవసాయ శాఖ 4,జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 3, మున్సిపాలిటీ 2, మెప్మా,పశు సంవర్ధ శాఖ, సర్వే ల్యాండ్ , పంచాయితీ



శాఖ,వైద్య శాఖ,జిల్లా వెనకబడిన తరగతులు శాఖ,రవాణా శాఖ,చేనేత మరియు జౌళి శాఖ ,ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ , జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి శోభ రాణి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా సీఎంఆర్ఎఫ్: ఎమ్మెల్యే బీర్ల

**ఆత్మకూర్(ఎం), జనవరి 27 (మనం న్యూస్):** మండల కేంద్రానికి చెందిన పలువురి లబ్దిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వారి క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ



కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ముద్దసాని సిద్దులు గౌడ్, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ కాంగ్రెస్ అద్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్, బత్తిని ఉప్పలయ్య గౌడ్, ఎద్దు వెంకన్న, బీసీ సెల్ పట్టణ అద్యక్షులు ఎలగందుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తర్ల అనిల్ బూడిది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా నల్గొండ ప్రెస్ క్లబ్

**నల్లగొండ,జనవరి 27( మనం ప్రతినిధి):** జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ప్రెస్ క్లబ్ అండగా ఉంటుందని నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీడియో జర్నలిస్టు రవిని ప్రెస్ క్లబ్ కార్యదర్శులు వరకాంతం కిరణ్ రెడ్డి, మొహ్మద్ సయ్యద్ తో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం ప్రెస్ క్లబ్ తరపున 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. తోటి జర్నలిస్టుకు ఆపద వచ్చిన వెంటనే స్పందించిన సహచర జర్నలిస్టులందరికీ ప్రెస్ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టులకు నల్గొండ ప్రెస్ క్లబ్ ఎప్పుడూ అండ గా ఉంటుందని, ఏ ఆపద వచ్చినా ఆదుకు నేందు కు ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమ ంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు నగర భాస్కర్, సోమ చంద్రశేఖర్, వెంకన్న, రాజు, శ్రీను, కనకాచా రి, డివి యాదవ్, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం

- స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి
- మాజీ ఎమ్మెల్యే బొల్లం

**అనంతగిరి, జనవరి 27( మనం న్యూస్):** కార్యకర్తలకు చీమంత హాని జరిగినా... చిరుతనై వస్తానని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.మండల పరిధిలోని చనిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం ఈ కార్యక్రమానికి కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ బిఅర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాడం ఖాయం అని స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలి అని పిలుపునిచ్చారు.ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయింది అని సంవత్సరం కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చింది అని ఆయన అన్నారు. బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదేనన్నారు. వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండుఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిండు అని గుర్తు చేశారు.పింఛన్లు దగారైతులకు బోనస్ దగా రుణమాఫీ దగా తులం బంగారం దగా విద్యార్థులకు జాబ్స్ దగా మహిళలకు 2500 దగా అన్నీ దగా రేవంత్ రెడ్డి



కాదు ఎగవేతల రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు చీటింగ్ మ్యాన్అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండని అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులోత్ శ్రీనివాస్ నాయక్, హనుమంతరావు పార్టీ నాయకులు మట్టపల్లి పుల్లయ్య గౌడ్, పూర్ణచందర్, అఫ్జల్ ,బిక్షం, మట్టపల్లి సైదులు, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, సింగల్ విండో డైరెక్టర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

**సూర్యాపేట, జనవరి 27 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అన్నారు.జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను అభినందనీయమని తెలిపారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో వేబెక్స్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపికకై ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణలో ప్రజల సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి అధికారుల కృషి మరియు ప్రతిష్టాత్మక పనితీరును కలెక్టర్ ప్రశంసించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కొన్ని తప్పులు జరిగినట్లు దృష్టికి రావడం జరిగిందని అధికారులు జాగ్రత్తగా పరిశీలించాలని, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందాలని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డులు కొరకు సోషల్ ఎకనామిక్స్ సర్వే, మీసేవ, ప్రజా పాలన లో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఇవ్వాలని ఉద్యోగులు,ఇన్కమ్ టాక్స్ కట్టే వారి దరఖాస్తులు రిజక్ట్ చేయలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా ఒక కుటుంబానికి ఒక ఇల్లు ఒక కుటుంబంలో ఇద్దరికీ మంజూరు చేయవద్దని పరిశీలించి అర్హులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు.ఈ నాలుగు సంక్షేమ పథకాల అమలులో అర్హులకు మాత్రమే అందేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఇంకా దరఖాస్తు







చేసుకొని వారు ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజా పాలన సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించడంలో స్ఫూర్తితో పనిచేయాలని సంక్షేమ కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతరం ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయుటలో ఒక టీముగా ప్రతి ఒక్కరు ఐకమత్యంతో వ్యవహరించాలని వెల్లడించారు. ఉద్యోగి సేవాకాలంలో పేదలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, అదే ప్రతి ఉద్యోగికి ఆశీర్వాదమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు, డి ఆర్ డి ఓ వివి అప్పారావు, డిఇఓ అశోక్ ,పశుసంవర్ధక అధికారి శ్రీనివాస్ ,మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, డీఎస్ఓ రాజేశ్వరరావు, డి డబ్ల్యు నరసింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, ఇండస్ట్రియల్ అధికారి సీతారాం నాయక్ , అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి...**

ప్రజావాణి లో వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ అన్నారు సోమవారం జిల్లా సమీకుంట కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి 93 దరఖాస్తులు వచ్చాయని సంబంధిత శాఖ అధికారులు దరఖాస్తులు వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షల కొరకు అని ఏర్పాట్లు చేయాలని సమంత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు పోలీస్ శాఖ వారు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సి ఆర్ పి సి సెక్షన్ ప్రకారం 144 సెక్షన్ అమలుపరచాలని జిరాక్స్ సెంటర్ లన్ని బంద్ చేయాలని అధికారులు తమ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వారు పరీక్షల సమయంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు 03 -02-2025 నుండి 22 -02-2025 వరకు ఇంటర్మీడియట్ థిరి పరీక్షలు05-03-2025 నండి 25-03-2025 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మరియు 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, తీరి పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, కావున పరీక్ష సమయానికి అన్ని రోడ్లలో బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ నందు చదువుతున్న విద్యార్థుల కొరకు వారు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా సంక్షేమ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ వారు నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు పరీక్ష కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను అధికారులు అర్హులైన వారికి అందేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ పి రాంబాబు, డి ఆర్ డి ఓ వివి అప్పారావు, సిపిఓ ఎల్ కిషన్, ఎల్ డి ఎం బాపూజీ, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిటిడివో శంకర్, డిఇఓ అశోక్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత ,బిసి అభివృద్ధి అధికారి అనసూయ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, డియమ్ మార్కెటింగ్ శర్మ జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడపిల్లలు సోషల్ మీడియా వాడకం పట్ల

- డ్రగ్స్,సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి
- సెల్‌ఫోన్‌లో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలకు మోసపోవద్దు
- సైబర్ నేరాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ భగవాన్

**తుంగతుర్తి, జనవరి 27, (మనం న్యూస్):** ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ , ఎస్సై క్రాంతి కుమార్ మండల కేంద్రంలోని తెలంగాణ సాఫిక గురుకుల పాఠశాల మరియు కళాశాల లో సోమవారం సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాభృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎఎస్ఐ భగవాన్ మాట్లాడుతు జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై , సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు,గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్



వివరాలు,ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగం ప్రయాణించవద్దు అని వేధింపులపై100 కు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డిపి లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యోద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారుగంజాయి మత్తుమందులకుసంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు తెలంగాణ సాఫిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ రాంబాబు,సాయికుమార్, హోంగార్డ్ ప్రసాద్, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, నాగార్జున ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**జాజిరెడ్డిగూడెం, జనవరి 27మనం న్యూస్:** భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరూరి యోగనందచార్యులు ఆదేశను అనుసారం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులనుజాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ ధనమ్మ 50000, పాక వీరేష్ యాదవ్ బావ ఉప్పు అవిలేను 60000, మాదగాని మహేష్ 20000, వల్లాల శైలజ 17000, మొత్తం147000 చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్ గౌడ్ , జాజిరెడ్డిగూడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శీగ నసిర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు నర్సింగ కృష్ణమూర్తి , సీనియర్ నాయకులు మామిడి సత్యానారాయణ ఎల్లంల కొమురెల్లి, జేరిపోతుల సోమయ్య, బింగి కృష్ణమూర్తి, కుంభం సత్తయ్య, దాసరి రవీందర్, నర్సింగ లింగయ్య, నర్సింగ వెంకన్న, బొల్లం సైదులు, మాద గాని సుదర్శన్, రింగు నరహరి, జేరిపోతుల రాంప్రసాద్, మామిడి విజయ్ కుమార్, పసుపులేటి సందీప్ ,మామిడి అనిల్, కామగాని మధు, నర్సింగ నరేష్, కోర పిడత నరేష్ పలువురు పాల్గొన్నారు.

# పదోన్నతుల ద్వారానే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం

- పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది
- పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్

**మంచిర్యాల, జనవరి 27(మనం న్యూస్):** పదోన్నతుల ద్వారానే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం, పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఐపిఎస్.,(ఐజి) అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 మంది హెడ్ కానిస్టేబుల్ లకు ఏఎస్ఐ లుగా, ఇద్దరు ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ లకు ఏఆర్ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన అధికారులకు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఐపిఎస్.,(ఐజి) కార్యాలయంలో అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు



పొందాలని అన్నారు. క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకు రావాలని, ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విధులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి ఎం. రమేష్, ఏఆర్ ఏ సి పి ప్రతాప్, ఆర్ ఐ మల్లేశం, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు పెన్షన్ పట్ల కరుణ, జాలి చూపని వైనం..

- స్వయంగా వివరాలు తెలుసుకుని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్


మంచిర్యాల, జనవరి 27(మనం న్యూస్): వికలాంగుల మైన తమపై కరుణ... జాలి... చూపాలని చిన్నచిన్న విషయాల్లో తమకు పెన్షన్ రాకుండా... ఇవ్వకుండా జీవనాధారం లేకుండా చేయడం కరెక్టు కాదని తమకు ఆధారం చూపాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో ఇద్దరు వికలాంగ ఆడపిల్లలు, వారి తల్లి తండ్రులు వేడుకున్న దృశ్యం అందరినీ ఆలోచింపజేసింది. స్వయంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వేదిక పై నుంచి కిందికి దిగివచ్చి బాలిక బాధ విని, చలించి వివరాలు తెలుసుకొని ఆమెకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మందమర్రి సమీపంలోని బురద గూడె గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... తనకు ఇద్దరు కూతుళ్ళని కూలీ చేసుకుని పొట్ట పోసుకుంటున్నామని, తన పెద్ద కూతురు 19 ఏళ్ల దుర్గం రాజు భాయ్‌కి రెండు కాళ్ళు చిన్నప్పటి నుంచి పని చేయక వీలు కుర్చీకి పరిమిత మైందని తన కూతురు కు వికలాంగుల పెన్షన్ మంజూరు అయ్యి వస్తుందని, అయితే గత రెండు నెలలుగా పెన్షన్ ఆగి పోయిందని, ఎందుకు రావడం లేదో తెలుసుకుంటే నా కూతురు సదరన్ సర్టిఫికెట్ పోయిందని దాంతో పెన్షన్ ఆగిపోయినట్లు సార్లు చెబుతున్నారని, దాంతో నా ఇద్దరు పిల్లలను సాగడానికి కష్టమవుతుందని తన కూతురుకు పెన్షన్ ప్రతి నెల వచ్చేల ఇప్పించాలని కలెక్టర్ ను కోరింది. దుర్గం లక్ష్మి తనకూతురు దుర్గం రాజు భాయ్ ని ఎత్తుకుని ప్రజావాణి వేదిక ముందు వచ్చి నేల మీద కూర్చోబెట్టడంతో స్వయంగా జిల్లా కలెక్టర్ వేదిక పై నుంచి కిందకు వచ్చి ఆమె వివరాలు తెలుసుకుని హామీ ఇవ్వడంతో అక్కడికి వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. ఇక మంచిర్యాల పట్టణం గోపాల వాడకు చెందిన ఎస్ శ్రీనివాస్, స్రవంతి దంపతుల కూతురుకు మూగ, చెవుడు వినికిడి సమస్యలు ఉండగా ఆమెకు వికలాంగుల పెన్షన్ కావాలని గత ఐదు సంవత్సరాలుగా వారు తిరుగుతున్నారు. తాము ఎన్ని దరఖాస్తులు పెట్టినా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని సదరన్ క్యాంపులకు స్లాట్ లో బుక్ చేసుకుని డాక్టరుకు దగ్గరికి వెళితే పరీక్షించి పాపకు బాగానే ఉందని వికలాంగుల సర్టిఫికెట్ ఇవ్వడం లేదని దాంతో పెన్షన్ రాక ఇబ్బందులకు గురవుతున్నట్లు తండ్రి శ్రీనివాస్ చెప్తూ వాపోయ్యాడు. తాను ప్రైవేటుగా టీచర్ ఉద్యోగం చేస్తానని, ఆర్థిక భారంతో కుటుంబం గడవటం కష్టంగా ఉందని తమ కూతురుకు వికలాంగుల కోటాలో పెన్షన్ ఇవ్వాలని కలెక్టర్‌ను స్వయంగా కలసి వివరాలు తెలిపి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు.



# జాతీయస్థాయిలో రాణించాలి

- మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్జున్

**మిర్యాలగూడ, జనవరి 27 (మనం న్యూస్):** గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని మిర్యాలగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ అన్నారు. మాడుగులపల్లి మండలం కుక్కడం



గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో గెలిచిన జట్లకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని విజేత జట్టు రూ. 20,016 నగదు బహుమతి దాత అర్జున్ మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా హెల్త్ ఫిట్నెస్ పై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలోమునగాల రామచంద్రారెడ్డి, అలుగుబెల్లి గోవిందరెడ్డి, బొంగర్ల నాగరాజు, పందిరి మధు, బట్టు మాధవరెడ్డి, నీలం అంజి, గంగాధర్, క్రీడ నిర్వాహకులు సాయి, ఉదయ్, రమేష్, బొంగర్ల నరేష్ ఉన్నారు.

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్ కు వినతి

**మర్రిగూడ, జనవరి 27(మనం న్యూస్):** మండలంలోని లెంకలపల్లి గ్రామంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేతరి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠీనీ కలిసి వినతి పత్రం అందజేశారు.

గ్రామంలో అర్హులైన వారికి రేషన్ కార్డు రాలేదని కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో కూడా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు.వినతి



పత్రం అందజేసిన వారిలో వావిళ్ళ నరసింహ, అయితగోని వెంకటయ్య ప్రసాద్, దామర మల్లేష్ ,వావిళ్ళ దేవదాస్, అయితగోని నరేష్, మానుపాటి సతీష్, ఏర్పుల హరీష్, అయితగోని రవి, రమేష్, శ్రీశైలం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# మెరుగైన సమాజ చోదక శక్తులు అధికారులు

- టీజీఓ వరంగల్ డైరీ ఆవిష్కరణలో కలెక్టర్ సత్య శారద

**వరంగల్, జనవరి 27(మనంన్యూస్):** ప్రజల సమస్యల పట్ల సకాలంలో స్పందించి పరిష్కార మార్గాలను రూపొందించి ఆచరణలో అమలు చేయడంలో గెజిటెడ్ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు.తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం వరంగల్ జిల్లా శాఖ డైరీని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.జిల్లా అధ్యక్షుడు రామి రెడ్డి అధ్యక్ష్యతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. వరంగల్ జిల్లా ఇతిహాసిక,సాంస్కృతిక రంగాలలో సారవంతమైందని ,ఈ నేలలో చలనశీలతను ఉందని,అది అధికారులను మరింత ఉత్కృష్టంగా పని చేయించడానికి ఉత్ప్రేరకంగా ఉంటుందని అన్నారు.ప్రజాపాలన నిబద్ధతతో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందని,అందుకు తగిన పర్యవేక్షణ సి యం,కేబినెట్ పెద్దలు చేస్తున్నారని అన్నారు.వరంగల్ ను పారిశ్రామిక,,ఎయిర్ పోర్ట్ సౌకర్యాల




ఏర్పాటులో,ఫ్లాగ్ షిప్ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వరంగల్ పరిపాలన స్ఫూర్తిదాయకంగా ఉందని ,దీనిలో అధికారుల అంకితభావం,అలుపులేని శ్రమ ఉందని అన్నారు.పనిలో దివ్యత్వం సంప్రదాయంతో మెరుగైన సమాజ నిర్మాణము జరుగుతుందని అన్నారు.దీనికి అధికారులే చోదక శక్తులు అని అన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో టీజీఓ మహత్తర పాత్ర పోషించిందని అన్నారు.టి జి ఓ సహాధ్యక్షులు అనురాధ మాట్లాడుతూ 18 ఏండ్ల ప్రస్థానంలో టీజీఓ గెజిటెడ్ కేడర్ ఉద్యోగులకు ,సామాజిక భాద్యతతో సమాజానికి చేసిన సేవలను వివరించారు. వేడుకగా ,ఆలోచనాత్మకంగా ,ఉత్సాహభరిత జరిగిన ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీజీఓ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ,రచయిత అస్నాల శ్రీనివాస్,సాంస్కృతిక కార్యదర్శి కోలా రాజేష్ కుమార్ ,జిలా కార్యదర్శి ఫణి కుమార్,కోశాధికారి ఈగ వెంకట్,హన్మకొండ నేతలు మురళీధర్ రెడ్డి,ప్రవీణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు భాగ్యలక్ష్మి,రామ చందర్ రావు,సుధీర్ కుమార్ విజయనిర్మల,హేమలత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి




- బోర్డు ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, జనవరి 27(మనంన్యూస్):** వచ్చే ఫిబ్రవరి 3 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రయోగ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలనీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ ప్రయోగ పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 3 నుండి జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభించబడుతాయని, నాలుగు విడుతల్లో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 1496 మంది ప్రథమ సం, 3484 మంది ద్వితీయ సం. విద్యార్థులుమొత్తం 4980 మంది ప్రయోగ పరీక్షకు హాజరు కానున్నారు. ఈ సారి ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుండి పర్యవేక్షించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, విద్య, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీ గా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తున్నందున

విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి(ఇన్చార్జి) మాధవ రావ్,డిఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మత్స్యగిరింద్ర స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**శంకరపట్నం, జనవరి 27 (మనం న్యూస్):** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్యగిరింద్ర స్వామి వారిని సోమవారం మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకుని ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఫిబ్రవరి నెలలో జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ



జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని భక్తుల సౌకర్యార్థం జాతరలో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు నిరంతకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శ్రీ మత్స్యగిరింద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు గల మల్లారెడ్డి, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంగ్లండ్ తో మూడో టీ20..

# భారత జట్టులోకి ఇద్దరు స్టార్ ప్లేయర్లు?





భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం స్వదేశంలో ఐదు మ్యాచ్ ల సిరీస్ లో ఇంగ్లండ్ తో తలపడుతోంది. ఇప్పటికే తొలి రెండు టీ20ల్లో విజయం సాధించిన టీమిండియా.. ఇప్పుడు మూడో మ్యాచ్ లో పర్యాటక జట్టును ఢీకొట్టేందుకు సిద్ధమైంది.
రాజ్ కోట్ వేదికగా మంగళవారం భారత్-ఇంగ్లండ్ మధ్య మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచి సిరీస్ ను సొంతం చేసుకోవాలని భారత్ భావిస్తుంటే.. ఇంగ్లండ్ జట్టు మాత్రం ఎలాగైనా తిరిగి పుంజుకోవాలని పట్టుదలతో ఉంది. ఇక రాజ్ కోట్ టీ20లో భారత్ రెండు మార్పులతో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.

**శివమ్ దూబే రీఎంట్రీ?**

మూడో టీ20కు భారత తుది జట్టులో ఆల్రౌండర్ శివమ్ దూబే వచ్చే అవకాశముంది. చెపాక్ టీ20కు ముందు గాయం కారణంగా జట్టుకు దూరమైన నితీశ్ కుమార్ స్థానాన్ని దూబేతో బీసీసీఐ భర్తీ చేసింది. అయితే అప్పటికే దూబే రంజీ ట్రోఫీలో ఆడుతుండడంతో రెండో టీ20లో ప్లేయింగ్ ఎలెవన్ లో చోటు దక్కలేకపోయాడు. రెండో టీ20 అనంతరం రాజ్ కోట్లో జట్టుతో దూబే కలిశాడు. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ స్థానంలో తుది జట్టులోకి దూబే రావడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా దూబే టీ20 వరల్ కప్-2024 గెలిచిన జట్టులో సభ్యునిగా ఉన్నాడు. ఆ తర్వాత గాయం బారిన పడడంతో బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాతో సిరీస్ లకు దూరమయ్యాడు. మళ్లీ ఇప్పుడు దాదాపు 6 నెలల భారత జట్టు తరపున ఆడేందుకు ఈ ముంబై ఆల్ రౌండర్ సిద్ధమయ్యాడు.

**మహ్మద్ షమీకి ఛాన్స్..**

ఇక తొలి రెండు టీ20లకు బెంచ్కే పరిమితమైన స్టార్ పేసర్ మహ్మద్ షమీ రాజ్ కోట్ టీ20లో ఆడనున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజ్ కోట్ వికెట్ సాధరణంగా పేస్ బౌలర్లకు అనుకూలిస్తోంది. ఈ క్రమంలోనే మూడో టీ20లో ఇద్దరు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగాలని భారత జట్టు మెనెజ్ మెంట్ భావిస్తోంది.
స్పిన్నర్ రవి బిష్ణోయ్ ను పక్కన పెట్టి షమీని తుది జట్టులోకి తీసుకొచ్చే ఛాన్స్ ఉంది. అయితే తొలి రెండు టీ20ల్లో షమీకి ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదన్న విషయంపై ఇప్పటివరకు ఎటువంటి క్లారిటీ లేదు. కనీసం మూడో టీ20లో అయినా తమ ఆరాధ్య క్రికెటర్ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు.
భారత తుది జట్టు(అంచనా)
సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, మహ్మద్ షమీ, అర్ష్దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

# ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్గా బుమ్రా



భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ ను ప్రతిష్ఠాత్మక ఐసీసీ అవార్డు వరించింది. 2024 సంవత్సరానికిగాను టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అతను ఎంపికయ్యాడు. జో రూట్ (ఇంగ్లాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్)లను వెనక్కినెట్టి బుమ్రా ఈ అవార్డును దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న ఆరో భారత క్రికెటర్ గా బుమ్రా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ (2004), గౌతమ్ గంభీర్ (2009), వీరేంద్ర సెహ్వాగ్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2018) బుమ్రా కంటే ముందు ఈ అవార్డు అందుకున్నారు. 2024 ఐసీసీ టెస్టు జట్టులోనూ బుమ్రా చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది టెస్టుల్లో బుమ్రా అద్భుతమైన బౌలింగ్తో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్ ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే 2024లో సుదీర్ఘ ఫార్మాట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా రికార్డు సృష్టించాడు.

## గుకేశ్ గేమ్ డ్రా



టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్లో జోరు కొనసాగిస్తున్న దొమ్మరాజు గుకేశ్ ఎనిమిదో రౌండ్లో డ్రా చేసుకున్నాడు. ఆదివారం మరో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానందతో 33 ఎత్తుల్లో డ్రాకు అంగీకరించాడు. ఈ టోర్నీలో ఇప్పటిదాకా పరాజయం ఎరుగని గుకేశ్ మూడు గేమ్ లు గెలిచి.. అయిదింటిని డ్రా చేసుకున్నాడు. మరోవైపు అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణలకు కూడా డ్రానే ఎదురైంది. సరానా అలెక్సీ (సెర్బియా)తో అర్జున్ పాయింట్ పంచుకున్నాడు. ఈ గేమ్ 23 ఎత్తుల్లో ముగిసింది. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో పోరును హరికృష్ణ 30 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు.

## భారత గ్రాండ్ మాస్టర్తో కరచాలనం చేసేందుకు నిరాకరించి.. క్షమాపణలు చెప్పి..




టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్ నోడిర్ బెక్ యాకుబ్బోయేవ్ వ్యవహరించిన తీరు వివాదానికి దారితీసింది. గేమ్ సందర్భంగా భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి తో కరచాలనం చేయడానికి యాకుబ్బోయేవ్ నిరాకరించాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో.. అతడిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జరిగిన దానికి చింతిస్తూ ఉజ్బెక్ గ్రాండ్మాస్టర్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా క్షమాపణలు చెప్పాడు. వైశాలిపట్ల తనకు ఎలాంటి అగౌరవం లేదని.. కొన్ని కారణాల వల్ల చేయి ఇవ్వలేదని పేర్కొన్నాడు. 'మహిళలు, భారత చెస్ క్రీడాకారుల పట్ల నాకు గౌరవం ఉంది. నా ప్రవర్తన వలన ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే నన్ను క్షమించండి అని అన్నాడు.

**అసలేం జరిగిందంటే..**

నెదర్లాండ్స్ లోని విజ్కాంజీ వేదికగా టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ జరుగుతోంది. ఇందులో భాగంగా నాలుగో రౌండ్ లో నోడిర్బెక్, వైశాలి ముఖాముఖి తలపడ్డారు. ఆనవాయితీ ప్రకారం గేమ్ ప్రారంభానికి ముందు వైశాలి కరచాలనం చేసేందుకు ముందుకు చాచగా.. నోడిర్ బెక్ అవసరం లేదన్నట్లుగా తన కుర్చీలో కూర్చున్నాడు. ఈ గేమ్ లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్ పై వైశాలి విజయం సాధించింది. గేమ్ ఆరంభానికి ముందు ఎదురైన చేదు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని విజయం తర్వాత షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు రాలేదు.

## ఆమె నాకు చెల్లెలు లాంటిది..

టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ బాలీవుడ్ సింగర్ జనై భోస్లే తో ప్రేమలో పడ్డట్లు వార్తలొచ్చాయి. ఇటీవల ముంబయిలోని బాంద్రాలో జరిగిన ఆమె 23వ పుట్టినరోజు వేడుకలకు సిరాజ్ హాజరయ్యాడు. ఈ సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫొటోలను ఆమె తన ఇన్ స్టాలో పోస్టు చేయగా.. అందులో సిరాజ్, జనై కలిసి దిగిన పిక్ కూడా ఉంది. అయితే, ఆ ఫొటోలో ఇద్దరూ కాస్త సన్నిహితంగా ఉన్నట్లు కనిపించడంతో, వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నట్లు పలు వెబ్ సైట్లు వార్తలు రాసుకొచ్చాయి. దీంతో ఇదేదో తేడా కొట్టేలా ఉందని గ్రహించిన సిరాజ్ వెంటనే అలర్ట్ అయ్యాడు. దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని.. జనై తనకు చెల్లెలు లాంటిదని ఇన్ స్టా స్టోరీలో క్లారిటీ ఇచ్చాడు. ఫొటోను షేర్ చేస్తూ..

మనం మూవీ+

# అఘోర ఎంట్రీ సీక్వెన్స్కు సన్నాహాలు



నటసింహం బాలయ్య - బోయపాటి శ్రీను కాంబినేషన్లో రాబోతున్న 'అఖండ 2 - తాండవం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగా తాజాగా ఈ సినిమా షూట్ కి రెడీ అవుతుంది టీమ్. వచ్చే నెల రెండో వారం నుంచి బాలయ్య పై రామోజీ ఫిల్మ్ సిటీలో అఘోర పాత్రకు సంబంధించిన ఎంట్రీ సన్నివేశాలను షూట్ చేస్తారట. అందుకు సంబంధించిన సెట్స్ ను ప్రస్తుతం వేస్తున్నట్లు తెలుస్తోంది.
అన్నట్టు ప్రస్తుతం ఈ సినిమాలో నటించే నటీనటుల ఎంపిక పై దర్శకుడు బోయపాటి దృష్టి పెట్టారు. ఆల్ రెడీ, ఇప్పటికే పలు కీలక పాత్రల్లో ఇతర భాషల నటులను తీసుకోవాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యాన్ప రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బోయపాటి శ్రీను - బాలయ్య కాంబినేషన్ లో హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. దీంతో 'అఖండ 2 - తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి.

## ఎన్టీఆర్కు భారతరత్న ఇవ్వాలి – బాలకృష్ణ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సినీ పరిశ్రమకు అందించిన సేవలకు గాను నందమూరి బాలకృష్ణను పద్మ భూషణ్ అవార్డుకు ఎంపిక చేసింది కేంద్ర ప్రభుత్వం. ఈ క్రమంలో బాలయ్య, సీనియర్ ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని కామెంట్స్ చేశారు. ఇంతకీ బాలయ్య ఏం మాట్లాడారు అంటే.. 'నాకు పద్మభూషణ్ పురస్కారం దక్కడం చాలా సంతోషంగా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. దీన్ని బిరుదుగా కంటే బాధ్యతగా భావిస్తున్నాను' అని బాలయ్య తెలిపారు. బాలయ్య ఇంకా మాట్లాడుతూ.. 'ఎన్టీఆర్ తనయుడిగా పుట్టడం నా అదృష్టం. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరుతున్నాను. ఇది తెలుగు ప్రజలందరి కోరిక. ఉమ్మడి ఏపీ మాజీ సీఎంగా, దివంగత నటుడిగా ఎన్టీఆర్ ఎన్నో సేవలు చేశారు. అలాంటి మహనీయుడికి 'భారతరత్న' ఇవ్వాలి' అని నందమూరి బాలకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నట్టు బాలకృష్ణతో పాటు తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్, మాజీ క్రేజీ హీరోయిన్ శోభన తదితరులను కూడా పద్మ భూషణ్ అవార్డులకు ఎంపిక చేసింది కేంద్ర ప్రభుత్వం.



# లారెన్స్ చిత్రంలో నోరా



'కాంచన' సిరీస్ సినిమాలతో సినీ ప్రియుల్ని భయపెడుతూనే.. కడుపుబ్బా నవ్వించారు రాఘవ లారెన్స్. ఇప్పుడాయన ఈ ఫ్రాంఛైజీ నుంచి 'కాంచన 4'ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించనున్న చిత్రమిది. గోల్ మైన్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది. ఇందులో ఇద్దరు కథానాయికలు కనిపించనుండగా.. ఓ పాత్ర కోసం పూజా హెగ్డేను ఖరారు చేసినట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. కాగా.. ఇప్పుడా రెండో నాయిక పాత్రపైనా స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ఆ పాత్ర కోసం బాలీవుడ్ నాయిక నోరా ఫతేహిని ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. దీన్ని ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తారకేశ్వరి మూవీ పోస్టర్ ట్రైలర్ లాంచ్ చేసిన శ్రీశైలం యాదవ్




తారకేశ్వరి సినిమా పోస్టర్ను జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్ విడుదల చేశారు. శ్రీ శివ సాయి ఫిలిం బ్యానర్లో డైరెక్టర్ వెంకట్ రెడ్డి నంది దర్శక నిర్మాణంలో శ్రీకరన్, అనూష, షన్ను హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న సస్పెన్స్ సెంటిమెంటల్ థ్రిల్లర్ మూవీ 'తారకేశ్వరి'. ఈ చిత్రం పోస్టర్, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తారకేశ్వరి చిత్ర యూనిట్ కి శుభాకాంక్షలు తెలుపుతూ చిన్న సినిమాలను ప్రజలు ఆదరించాలని ఈ సినిమా థియేటర్లో చూడాల్సిందిగా ప్రేక్షకులకు శ్రీశైలం యాదవ్ కోరారు.

## 'హరి హర వీరమల్లు' బాబీ లుక్ రిలీజ్



పవన్కల్యాణ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా ఇది సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో బాబీదేవోల్ విలన్ గా కనిపించనున్న విషయం తెలిసిందే. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఓ కొత్త పోస్టర్ ను విడుదల చేసింది. అందులో రాజుల కాలం నాటి దుస్తుల్లో ఉన్న బాబీ కత్తి పట్టుకొని యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు కనిపించారు. ప్రస్తుతం బాబీ లుక్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. అనుపమ్ఖేర్, బాబీ దేవోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఇది రానుంది. ఇటీవల ఈ సినిమాలోని 'మాట వినాలి' అనే పాటను విడుదల చేయగా అది మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. పవన్ కల్యాణ్ ఆ పాటను స్వయంగా పాడారు. ఇందులో పవన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా.. స్వాతంత్ర్యం కోసం పోరాడే ఓ యోధుడుగా కనిపించనున్నారు. 2025 మార్చి 28న ఈ చిత్రం మొదటిభాగం ప్రేక్షకుల ముందుకురానుంది.

## 'కన్నప్ప' నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్కు డేట్ ఫిక్స్




టాలీవుడ్ హీరో మంచు విష్ణు నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ మూవీ 'కన్నప్ప' భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఈ సినిమాను బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మైథలాజికల్ చిత్రంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ మూవీ రూపొందుతోంది. ఇక ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తుండటంతో ఈ మూవీపై అన్ని భాషల్లోని ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి.
ఇక ఈ సినిమాలో అందరి చూపులు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కేమియో పై పడ్డాయి. ఈ సినిమాలో ప్రభాస్ ఎలాంటి పాత్రలో నటిస్తాడా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఈ సినిమాలో ఆయన లుక్ ఎలా ఉంటుందా అనేది కూడా హాట్ టాపిక్ అవుతోంది. అయితే, ఈ సినిమా నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్ ను రివీల్ చేసేందుకు 'కన్నప్ప' మేకర్స్ రెడీ అయ్యారు. ఈ మూవలోని ప్రభాస్ ఫస్ట్ లుక్ ను ఫిబ్రవరి 3న రివీల్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మేరకు ఓ సాలిడ్ పోస్టర్ తో ఈ అనౌన్స్మెంట్ ను చేశారు. ఇక దీంతో ఈ సినిమాపై ప్రభాస్ అభిమానులతో పాటు కామన్ ఆడియెన్స్ లో కూడా ఆసక్తి పెరిగింది. ఈ సినిమాలో మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ వరలక్ష్మీ శరత్ కుమార్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.